ఈనాడు అమరావతి గుంటూరు

సోమవారం మే 5, 2025

వేడుకున్నా.. వినరే!

- పోలీసు అధికారుల వద్ద వాపోతున్న బాధితులు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే

☛ ఫిజియో థెరపీ వైద్యుడినంటూ పరిచయమైన వ్యక్తి రైస్‌పుల్లింగ్ వ్యాపారం చేస్తే రూ.కోట్లలో లాభం వస్తుందని నమ్మించి తమ వద్ద రూ.1.47 కోట్లు తీసుకొని మోసగించాడని బాధితులు గోగుల ఆంజనేయులు, అతని భార్య నాసరమ్మ వాపోయారు. తమకు న్యాయం చేయాలని జిల్లా పోలీసు కార్యాలయం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అర్జీ ఇస్తే స్థానిక పోలీసుస్టేషన్‌లో కలవాలని సూచించారని పేర్కొన్నారు. స్టేషన్‌కు వెళితే తమ ఫిర్యాదును పట్టించుకోపోవడంతో మళ్లీ ఎస్పీని కలవడానికి వచ్చామని తెలిపారు.

☛ ఒక మహిళ తనకు అల్పాహారంలో మత్తు మందు కలిపి ఇచ్చి బంగారపు వస్తువులు దోచేసిన వైనంపై పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే స్థానిక స్టేషన్‌లో పరిష్కరిస్తారని పేర్కొనడంతో అక్కడికి వెళ్లారు. వారు పట్టించుకోపోవడంతో మళ్లీ ఎస్పీని కలవడానికి వచ్చామని బాధితులు మంగాదేవి, ఆమె భర్త శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

దొంగతనం, బెదిరింపులు, మోసాలు, దాడులు తదితర నేరాలపై పోలీసుస్టేషన్‌కు వెళితే రోజులు, నెలలు గడచినా పరిష్కరించకపోవడంతో ఉన్నతాధికారుల వద్ద తమ గోడు వెళ్లబోసుకోవడానికి బాధితులు సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వస్తున్నారు. ఇలా ప్రతి వారం వందలాదిమంది తరలి వస్తున్నారు. ఈ క్రమంలో కేంద్రంలో అర్జీ నమోదు చేసుకొని క్రమ పద్ధతిలో వెళ్లి అధికారులను కలవడానికి గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి. వారి గోడు ఆలకించిన ఉన్నతాధికారులు బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులను ఆదేశిస్తున్నారు. ఆ రసీదు తీసుకొని పోలీసుస్టేషన్‌కు వెళితే రోజుల తరబడి తిప్పుతున్నారే తప్ప తమ సమస్య పరిష్కరించడం లేదని బాధితులు వాపోతున్నారు.

సత్వరమే పరిష్కరించాల్సి ఉన్నా..

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. ఆమేరకు ప్రతి ఫిర్యాదును పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి వాటిని సంబంధిత పోలీసుస్టేషన్లకు అందజేస్తున్నారు. క్షేత్రస్థాయిలో స్టేషన్ అధికారులు వాటి పరిష్కారంలో తాత్సారం చేయడం సమస్యగా మారింది. బందోబస్తులు, ఇతర కీలక కేసుల దర్యాప్తులకు ప్రాధాన్యమిస్తూ వీటిని నిర్లక్ష్యం



అధికారులను కలవడానికి పోలీసు కార్యాలయానికి వచ్చిన బాధితులు(పాతచిత్రం)

చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుదారులు పదే పదే ఎస్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తమకు న్యాయం చేయాలంటూ అధికారులను వేడుకుంటున్నారు. స్టేషన్లలో తమ గోడు పట్టించుకోవడం లేదని, అదేమంటే ఏవేవో సాకులు చెబుతూ దబాయింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఫిర్యాదులు సత్వరమే పరిష్కారమయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాగులో సందేహాలా.. నివృత్తి చేసుకోండి

వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగులో తలెత్తే సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఈనాడు ఆధ్వర్యంలో 'డయల్ యవర్ జిల్లా వ్యవసాయాధికారి' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి **నున్నా వెంకటేశ్వర్లు** పాల్గొని వేసవి దుక్కులు, భూమిని సిద్ధం చేసుకోవడం, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువులు, సాగుకు విత్తన ఎంపిక, నకిలీల గుర్తింపు తదితర అంశాలపై రైతుల సందేహాలు, సమస్యలపై స్పందించనున్నారు. మీరు చేయాల్సిందల్లా.. ఈ కింది నంబరుకు ఫోన్ చేసి విషయం సూటిగా చెప్పడమే.

రేపు డయల్ యవర్ జిల్లా వ్యవసాయాధికారి



83310 56901

తేదీ: మంగళవారం (6.5.2025)

సమయం: ఉదయం 10 నుంచి 11 వరకు

ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు..!

జాబితాలు సిద్ధం చేస్తున్న విద్యాశాఖ అధికారులు

ఈనాడు-అమరావతి

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియకు సంబంధించి ఎట్టకేలకు క్యాడర్ స్ట్రెంగ్త్ కేటగిరీ వారీగా ఖరారైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఆయా క్యాడర్లలో మిగులు ఉపాధ్యాయులు(సర్‌ప్లస్) తేలారు. దీంతో పదోన్నతులు చాలా తక్కువ మందికి వస్తాయని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. ఏక్షణాన అయినా ప్రభుత్వం పదోన్నతుల షెడ్యూల్ జారీ చేసే అవకాశం ఉంది. ఆయా కేటగిరీల్లో పదోన్నతులకు అర్హులైన వారితో గుంటూరు నోడల్ డీఈవో కార్యాలయం జాబితాలు రూపొందించి వాటిపై అభ్యంతరాలు కోరగా.. ఇప్పటికే వచ్చి ఉన్నాయి. వాటిని సరిచేసి ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పెడుతున్నారు. పదోన్నతుల షెడ్యూల్ వెలువడే దాకా అభ్యంతరాలు తెలియజేయొచ్చని అధికారులు చెబుతున్నారు.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

అత్యధికంగా హిందీ ఉద్యోగోన్నతులు


ఈసారి హిందీ స్కూల్ అసిస్టెంట్స్‌కు కాస్త ఎక్కువగా ఉద్యోగోన్నతులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్యాడర్‌లో సుమారు 70 నుంచి 80 వరకు పోస్టులు ఉంటాయని అంచనా. ఆతర్వాత ప్రధానోపాధ్యాయుల విభాగంలో కొందరికి రానున్నాయి. ఈరెండు విభాగాల్లో కలిపి 100 నుంచి 120 మందికి వస్తాయి. మిగిలిన క్యాడర్లలో చాలా స్వల్ప సంఖ్యలో ఉన్నాయి. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి వారి సబ్జెక్టు టీచర్లతో బోధించేలా చర్యలు తీసుకుంది. అప్పట్లో డైరెక్టు రిక్రూట్‌మెంట్‌లో భర్తీ చేయాల్సిన 30 శాతం పోస్టులను ఉద్యోగోన్నతులలోనే ఖాళీలు లేకుండా భర్తీ చేసింది. దీంతో సెకండరీ గ్రేడ్ టీచర్లకు అప్పట్లో పదోన్నతులు బాగా వచ్చాయి. మరోవైపు అనేక పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు వచ్చాయి. దీంతో ప్రస్తుతం ఎస్జీటీల నుంచి ఎస్ఏలుగా, ఎస్ఏల నుంచి హెచ్ఎంలుగా పదోన్నతులు పొందే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది.

బదిలీల్లో వీరు చివరి స్థానాల్లో..

ప్రస్తుతం పదోన్నతులు పొందేవారు బదిలీల్లో చివరలో ఉంటారు. వీరు మిగిలిపోయిన ఖాళీలకు బదిలీ అవుతారు. ఈ దృష్ట్యా కొంతమంది పదోన్నతులు తీసుకోరు. వేసవి సెలవుల అనంతరం విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి బదిలీలు పూర్తిచేసి టీచర్ల కొరత లేకుండా చూస్తామని ఇంతకు ముందే ప్రభుత్వం చెప్పింది. ఈమేరకు ఒకవైపు పదోన్నతులు, మరోవైపు బదిలీల దిశగా చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం పదోన్నతులు పొందిన వారి స్థానాలను ఖాళీ పోస్టులుగా చూపి వాటిని బదిలీల జాబితాలో చేరుస్తారు. చివరిగా 2023లో బదిలీలు నిర్వహించినప్పుడు ఇదే విధానాన్ని నాటి ప్రభుత్వం అనుసరించింది. పదోన్నతులకు అంగీకారం తెలపగానే వారి పోస్టు వేకెన్సీ కిందకు వెళ్లిపోతుంది. వీరు బదిలీ అయితే..ఎక్కడైతే పోస్టులు ఖాళీగా ఉంటాయో వాటిల్లో సీనియారిటీ ప్రాతిపదికన కేటాయిస్తారు.

కందిపప్పు ఎప్పుడొస్తుంది..!

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బియ్యం కార్డుదారులకు ఈ నెలలోనూ కందిపప్పు అందని పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి కేటాయింపులు లేకపోవడంతో డీలర్లు సైతం డీడీలు కట్టలేదు. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, పంచదార మాత్రమే కార్డుదారులకు సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో పప్పు అరకొరగా సరఫరా అయినా, ఫిబ్రవరి నుంచి పూర్తిగా కేటాయింపులు లేవు. దీంతో కార్డుదారులకు సరఫరా జరగడం లేదు. గుత్తేదారులకు చెల్లింపులు లేకపోవడంతో గత ప్రభుత్వంలో ఏడాదిన్నరకు పైగానే కందిపప్పు నిలిచిపోయింది. కూటమి సర్కారు నవంబరులో సరఫరా పునఃప్రారంభించినా రెండునెలలు మాత్రమే ఇచ్చింది. ఈ ఏడాది జనవరి నుంచి ఐసీడీఎస్‌కు పప్పు సరఫరా చేస్తున్నారు. కార్డుదారులకు మాత్రం కేటాయించడం లేదు.



రేషన్ దుకాణాలు	972
బియ్యం కార్డులు	5,89,531
కేటాయింపులు (మెట్రిక్ టన్నుల్లో)	
బియ్యం	పంచదార
8990	230

జగజ్జననికి జేజేలు

వైభవంగా ప్రతిష్ఠా ఉత్సవాలు

కంఠంరాజు కొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా ఉత్సవాలు ఆదివారం కనులపండువగా సాగాయి. మంత్రి నారా లోకేశ్ అమ్మవారికి, కొత్తగా నిర్మించిన మండపాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడు, కుమారస్వామి వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా రాజగోపురం, ముఖ మండపం, విమానగోపురం, ధ్వజస్తంభం నిర్మించారు. దేవదాయశాఖ నిధులు రూ.కోటి, దొంతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి-వాసంతిలు తమ మనుమరాలు వశినీశ, మనుమడు శ్రీప్రద్‌వివస్వత్ రెడ్డి తరపున సుమారు రూ.4 కోట్లు, మరికొంత మంది దాతలు విరాళాలు సమకూర్చారు. ఆలయ పునర్నిర్మాణ సమయంలో రెండేళ్లపాటు అమ్మవారి దారువు రూపాన్ని బాలాలయంలో భక్తులు దర్శించుకున్నారు. నిర్మాణం పూర్తి కావడంతో అమ్మవారి మూర్తిని తిలకించి పునీతులయ్యారు.



మహంకాళి అమ్మవారు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి లోకేశ్

మంచికలపూడి, తుమ్మపూడి, కాజలకు చెందిన కోలాట బృందాల నృత్యాలు అలరించాయి. దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, డీసీ శ్రీనివాసరావులకు ఆలయంలో జరిగిన అభివృద్ధిని ఈవో సునీల్‌కుమార్, వంశపారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్ వివరించారు. మండలిలో చీఫ్ విప్ అనూరాధ, తెదేపా స్థానిక నాయకులు షేక్ జబీన్, కేసంనేని శ్రీఅనిత, యేళ్ల జయలక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సాయిచైతన్య తదితరులు పాల్గొన్నారు. సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పలువురు భక్తులు మంత్రి లోకేశ్‌తో సెల్ఫీలు దిగారు.

ఇళ్ల వివరాల సేకరణకు సర్వే నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తుళ్లూరు గ్రామం మీదుగా ఈ-5, ఎన్-13, డైమండ్ రింగ్ జంక్షన్ రహదరుల నిర్మాణం జరుగుతోంది. ఆయా మార్గాల్లో తొలగించాల్సిన ఇళ్ల కొలతల వివరాలను నమోదు చేసుకోవడానికి సోమవారం సీఆర్డీఏ అధికారులు సర్వే చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఇళ్ల యజమానులు అందుబాటులో ఉండి ధ్రువీకరణ పత్రాలు, గృహాల హద్దులు చూపించాలని సీఆర్డీఏ తహసీల్దారు కె.రవిబాబు తెలిపారు. తమ వద్ద కొద్ది మంది యజమానుల వివరాలే ఉన్నాయని, మిగతావి సర్వే చేసి సేకరిస్తామని ఆయన చెప్పారు.

నీట్ పరీక్షకు 97.71 శాతం హాజరు



తల్లిదండ్రులకు వస్తువులు అప్పగిస్తూ..



అభ్యర్థుల ఫొటో, వేలిముద్రలు సరి చూస్తూ..



మహిళా కళాశాల పరీక్ష కేంద్రం వద్ద గదుల వివరాలు చూసుకుంటూ..

గుంటూరువిద్య, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి వైద్య విద్యలో ప్రవేశాలకు సంబంధించి ఎన్టీఏ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ఆదివారం జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగింది. గుంటూరులో 14, తెనాలిలో రెండు కేంద్రాల్లో పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. పరీక్షకు మొత్తం 4250 మంది విద్యార్థులకుగాను 4153 మంది హాజరయ్యారు. ఈమేరకు 97.71 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ముందు నుంచే సమాచారం ఇవ్వడంతో విద్యార్థులతా సకాలంలోనే హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనల మేరకు సిబ్బంది ప్రతి విద్యార్థిని తనిఖీ చేశారు. కొందరు విద్యార్థులు చేతులు, కాళ్లకు దారాల వంటివి కట్టుకుని రావడంతో వాటిని తీసేయించారు. బాలికలు తమ జుట్టును జడల్లా కాకుండా వదిలేసి రబ్బరు బ్యాండ్ మాత్రమే పెట్టుకుని వచ్చేలా సూచించారు. ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉన్నవారు తమ వెంట వచ్చిన పెద్దలకు వాటిని అప్పగించి పరీక్ష హాల్‌లోకి వెళ్లారు. జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ప్రభుత్వ మహిళా జూనియర్, డిగ్రీ, హిందూ కళాశాలల కేంద్రాల్లో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

విచారణలు షురూ..!

- శిలాఫలక ఘటనపై ఏఎస్పీ
- డీఎస్పీతో హాస్టల్ వ్యవహారంపై..

ఈనాడు-అమరావతి

రాజధానిలో సచివాలయ టవర్ల శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకం ఊడిపడిందా? ఇంకేమైనా దాని వెనక కారణం ఉందా అనేది విచారించి నివేదిక అందజేయాలని ఏఎస్పీని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. 2018లో అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచివాలయంతో పాటు విభాగాధిపతుల టవర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రెండు శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో ఒకదాన్ని ధ్వంసం చేసినట్లు ఓ దినపత్రికలో వార్త రాగా వెంటనే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అక్కడ ఏం జరిగిందో పరిశీలించాలని ఆదేశించడంతో గుంటూరు నుంచి ఏఎస్పీ రమణమూర్తి, తుళ్లూరు పోలీసులు వెళ్లి పరిశీలించారు. వారి ప్రాథమిక పరిశీలనలో ఎక్కడా కూడా ధ్వంసం చేసిన ఆనవాళ్లు లేవని నిర్ధారణకు వచ్చారు. అయితే లోతైన దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో మరోసారి ఏఎస్పీ అక్కడకు వెళ్లి విచారించి నివేదిక అందజేస్తారని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

సీసీ కెమెరాలపై డీఎస్పీతో..



సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న డీఎస్పీ భానోదయ, ఎస్సై రోజ

గుంటూరు బ్రాడీపేటలోని స్టూడెంట్స్ హాస్టల్ నిర్వాహకుడొకరు అమ్మాయిలు స్నానాలు చేసే బాత్‌రూమ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పెట్టి వీడియోలు తీస్తున్నారని ఆదివారం కలకలం రేగింది. ఆ వసతిగృహంలో ఉంటున్న పలువురు యువతులు అరండల్‌పేట స్టేషన్‌కు వచ్చి ఈ కెమెరాలపై ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ దర్యాప్తునకు ఆదేశించారు. అమ్మాయిల వ్యవహారం కావడంతో సౌత్ డీఎస్పీ భానోదయను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆమె ఆదివారం రాత్రి హాస్టల్‌కు వెళ్లి కెమెరాలు ఎక్కడ ఉన్నాయి? యువతులు చెబుతున్నట్లు వారికి ఇబ్బందిగా ఉందా? ఆ కెమెరాల్లో ఇప్పటివరకు ఏమైనా అమ్మాయిల చిత్రాలు నిక్షిప్తమయ్యాయా అని హాస్టల్ నిర్వాహకుల నుంచి ఫుటేజీలు సేకరించారు. వాటిని పరిశీలించి..ఏం జరిగిందో తెలుసుకోవడానికి డీఎస్పీనే స్వయంగా అమ్మాయిలతో పాటు హాస్టల్ నిర్వాహకులను విచారించారు. అంతకుముందు వెస్ట్ డీఎస్పీ అరవిందకుమార్ కూడా సమాచారం తెలుసుకుని ఆ వసతిగృహం వద్దకు వెళ్లి పరిశీలించారు.

పైపుల ఘటనపై..

అమరావతి పనుల పునర్నిర్మాణ సభ రోజున వెంకటపాలెం ఎన్-7 రోడ్డులో రాజధాని పనులకు తీసుకొచ్చిన పైపులు తగలబడ్డాయి. ఈ ఘటనపై ఒకవైపు ఫోరెన్సిక్ విభాగం పోలీసులు నమూనాలు సేకరించి విచారణ చేస్తున్నారు. అదే సమయంలో గుంటూరు జిల్లా పోలీసులు ఆ పైపులు తగలబడడానికి కారణం ఏమై ఉంటుందని విచారణ చేస్తున్నారు. గతంలో రాజధాని ప్రాంతంలో మట్టి తవ్వుకెళ్లిన పాత నేరస్థులు ఏమైనా దీనికి తెగబడ్డారా? వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారని ఆరా తీసి వారేమైనా ఈ ఘాతుకానికి పాల్పడ్డారా అనే కోణంలో విచారిస్తున్నారు. ఘటన ప్రదేశంలో ఏమైనా ఖాళీ సీసాలు, అగ్గిపెట్టెలు ఉన్నాయా అని పరిశీలించారు. అలాంటివేమీ లభ్యం కాలేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. కెమికల్ ఎనాలసిస్‌కు నమూనాలు పంపామని, నివేదికలు రావడానికి మరో 10 రోజులకు పైగా సమయం పడుతుందని అధికారి ఒకరు తెలిపారు.

గత పాలకుల పాపం.. ప్రజలపై భారం

పట్టణ వాసులపై అదనంగా రూ.15.69 కోట్ల ఆస్తిపన్ను

పొన్నూరు, న్యూస్‌టుడే

పొన్నూరు నేతాజీనగర్‌కు చెందిన పి.వెంకటరామారావు చిరు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆయన గత ఏడాది ఇంటి పన్ను రూ.4,500 చెల్లించారు. ఈ ఏడాది ఆస్తి పన్ను 15 శాతం పెరగడంతో పురపాలక సంఘానికి రూ.5,150 చెల్లించారు. అదనంగా రూ.650 కట్టాల్సి వచ్చింది.

పురపాలక సంఘం	గృహాల సంఖ్య	2024-25	2025-26	అదనం
		(ఆస్తి పన్ను - రూ.కోట్లలో)		
గుంటూరు	2,02,832	118.10	128.82	10.72
మంగళగిరి-తాడేపల్లి	85,926	29.36	31.88	2.52
తెనాలి	37,072	17.55	19.56	2.01
పొన్నూరు	11,657	4.42	4.86	0.44
మొత్తం	3,37,487	169.43	185.12	15.69



పొన్నూరు పురపాలక సంఘం

గత వైకాపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇలా పొన్నూరు పట్టణ వాసులపై రూ.44 లక్షల భారం పడింది.

వైకాపా పాలనలో మార్కెట్ విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానం అమలు చేశారు. రిజిస్ట్రేషన్ అధికారులు మార్కెట్ విలువ పెంచినప్పుడల్లా 15 శాతం లోపు ఆస్తి పన్ను పెంచుకునే వెసులుబాటును పురపాలక సంఘ అధికారులకు గత ప్రభుత్వం కల్పించింది. ఈ భారంపై అప్పట్లో ప్రజలు గగ్గోలు పెట్టారు. నాటి వైకాపా పాలకులు దానిని పట్టించుకోలేదు. గతంలో ఆ ప్రాంతాన్ని అనుసరించి గుడిసె, రేకులు, స్లాబులకు రకరకాలుగా పన్ను విధించారు. స్థలంలో భవనం ఉన్నంత వరకు గతంలో రెవెన్యూ అధికారులు కొలతలు కొలిచి ఆస్తి పన్ను విధించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో స్థలంతోపాటు భవన విలువను లెక్కించి పన్ను విధిస్తున్నారు. ఇలా వైకాపా ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా ప్రజలు ఈ ఏడాది అదనంగా రూ.15.69 కోట్లు చెల్లించాల్సి వస్తోందని గృహ యజమానులు వాపోతున్నారు.



ధ్రువపత్రాలు చూపుతున్న బాధితులు

సొసైటీ, చిట్ పేరిట నమ్మించి మోసం

తెనాలిలో బాధితుల ఆందోళన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : సొసైటీ, చిట్ పేరుతో నమ్మించి మోసం చేశారని వేమూరు మండలం చావలి, జంపని పరిసర గ్రామస్థులు తెనాలిలో ఆదివారం ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన సమాచారం ప్రకారం.. తెనాలి పట్టణంలోని గంగానమ్మపేటలో బంగారు దుకాణం నిర్వహిస్తున్న కొల్లూరు ఉదయ వెంకటేశ్వరరావు శ్రీమణికంఠ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఏర్పాటు చేశారు. దీన్ని తెనాలి, చావలి కేంద్రాలుగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తమ వద్దకు వచ్చే ఖాతాదారులతో అందులో పెట్టుబడులు పెట్టించారు. ఇవి కాకుండా చిట్స్ వేయించి, బంగారు నగలు చేయించి ఇస్తానని నగదు తీసుకున్నారు. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టుకున్నారు. ఇలా దాదాపు రూ.9 కోట్ల వరకు వసూలు చేశారు. గత కొద్ది రోజులుగా డిపాజిట్ల చెల్లింపులు లేకపోవడం, చేయించి ఇస్తానన్న నగలు ఇవ్వక పోవడం, తాకట్టు ఆభరణాలు విడిపించుకుందామని వస్తే దుకాణం మూసివేసి ఉండడం, ఫోన్లు పని చేయక పోవడంతో వారంతా ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో బాధితులు తెనాలి నాజరుపేటలోని ఉదయ వెంకటేశ్వరరావు ఇంటికి రాగా తాళం వేసి ఉందని బాధితులు ఆవేదన చెందారు. ఈ వ్యవహారం అతని సోదరుడికి కూడా తెలుసని, ఇప్పుడు అడుగుతుంటే తమపైనే ఎదురు కేసులు పెట్టిస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై పోలీసులు మాట్లాడుతూ కొంత మంది తమ వద్దకు వచ్చారని, సమగ్ర వివరాలతో ఫిర్యాదు చేయాలని సూచించామని, ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

వెంటాడిన మృత్యువు

- ప్రమాదంలో ఇద్దరు కొప్పురావూరువాసుల మృతి

న్యూస్‌టుడే - ఒంగోలు నేరవిభాగం, పెదకాకాని: ఆదివారం... సమయం వేకువజామున 4.50 గంటలు. పదహారో నంబరు జాతీయ రహదారిపై చీమల దండులా వాహనాలు దూసుకుపోతున్నాయ్. అంతలో మరమ్మతులకు గురైన ఓ లారీ రోడ్డు పక్కన ఆగింది. అంతే..వెనుకగా వచ్చిన మరో రెండు లారీలు ఒకదాని తరువాత ఒకటి బలంగా ఢీకొట్టి రహదారిపై బోల్తా పడ్డాయి. దాదాపు కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏం జరుగుతుందో అర్థమయ్యేలోగా..ఆగిన వాహనాలను ఢీకొని మరో రెండు దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇద్దరు తల్లీకుమారులు సహా మొత్తంగా అయిదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులంతా నెల్లూరు, గుంటూరు జిల్లాల వాసులు. అంతా పావుగంట వ్యవధిలో జరిగిపోయింది. ఒంగోలు - నెల్లూరు మార్గంలో కొప్పోలు సమీపంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు వాసులు ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషయమంగా ఉంది.



పావని, కౌశిక్ (పాతచిత్రం)



రెండు లారీల మధ్య నుజ్జయిన కారు

గ్రామంలో విషాద ఛాయలు

పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, పావని(42) దంపతులకు వెంకట హర్షవర్ధన్, కౌశిక్(16) కుమారులు. ఐదేళ్ల కిందట వీరు గుంటూరుకు మకాం మార్చారు. అక్కడే ఓ ప్రైవేటు కళాశాలలో వెంకటేశ్వరరావు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వెంకటేశ్వరరావు పెదనాన్న కుమార్తె లావణ్యకు పల్నాడు జిల్లా అమరావతికి చెందిన వినయ్‌కు కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమారుడు లోక్షిత్ సంతానం. లోక్షిత్‌కు తిరుపతిలో పుట్టి వెంట్రుకలు తీయించేందుకు లావణ్య దంపతులతో కలిసి వెంకటేశ్వరరావు, పావని తమ చిన్న కుమారుడితో కలిసి ఆదివారం తెల్లవారుజామున కారులో తిరుపతి బయలుదేరారు. ఈ క్రమంలో కొప్పోలు వద్ద ఆగి ఉన్న వీరి కారును వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టడంతో పావని, కౌశిక్ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కొప్పురావూరులో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు మృతుల ఇళ్లకు చేరుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్నారు.

ఆశలు ఆవిరి..

ఉపాధ్యాయుడైన వెంకటేశ్వరరావు తన ఇద్దరు కుమారులను బాగా చదివించాలనుకున్నారు. ఇందులో భాగంగా ఇంటర్ పూర్తి చేసిన పెద్ద కుమారుడు వెంకట హర్షవర్ధన్‌కు హైదరాబాద్‌లో పలు ఎంట్రన్స్ టెస్టులకు సంబంధించి శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇటీవల చిన్న కుమారుడు కౌశిక్‌కి పదో తరగతిలో 576 మార్కులు వచ్చాయి.

సైనిక లాంఛనాలతో జవాను అంత్యక్రియలు

అమృతలూరు, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా అమృతలూరుకు చెందిన సైనికుడు నార్ల నరేష్ విధి నిర్వహణలో దుర్మరణం చెందిన విషయం విధితమే. ఆయన స్వగ్రామం అమృతలూరులో ఆదివారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని బంధుమిత్రులు, గ్రామస్థులు, ప్రభుత్వ అధికారులు పాల్గొని నివాళి అర్పించారు. సైనికుడి మృతదేహాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సందర్శించి నివాళి అర్పించారు.

తెనాలి- రేపల్లె ట్రాక్‌పై వంతెన పనులు



తెనాలి టౌన్, న్యూస్‌టుడే : తెనాలి పట్టణ మొండిగోడల వద్ద తెనాలి- రేపల్లె రైల్వే ట్రాక్ వంతెన పనులు ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగాయి. ఈ ప్రాంతంలోని కాలువపై స్లాబ్ పోసి తిరిగి ట్రాక్ ఏర్పాటు చేశారు. భారీ యంత్రాలతో ఆయా పనులు నిర్వహించారు. అధికారులు పర్యవేక్షించారు.

పైసా చెల్లించకుండానే 60 వైద్య పరీక్షలు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత సేవలు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: పట్టణాల్లో రోగుల కోసం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇక్కడ ప్రాథమిక చికిత్స సదుపాయాలున్నా.. 60 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నా.. ప్రజలు వాటిని అంతగా వినియోగించుకోలేని పరిస్థితి. తాజాగా ఖరీదైన సీబీపీ, ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, వైరల్ మార్కర్ల పరీక్షలు ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రాల గురించి సరైన ప్రచారం లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. గతం కంటే కొంత పెరిగినా.. మరింత మంది వీటిని వినియోగించుకుంటే సర్వజనాసుపత్రిపై భారం తగ్గడంతో పాటు రోగులూ చిన్నపాటి రోగాలకు గంటల తరబడి వేచి చూడకుండా సులువుగా వైద్య సేవలు పొందొచ్చు.

జిల్లా వ్యాప్తంగా 47 యూపీహెచ్‌సీలు

జిల్లా వ్యాప్తంగా గుంటూరుతో పాటు పట్టణాల్లో మురికివాడల సమీపంలో 47 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. గుంటూరులో 29, తాడేపల్లి 9, తెనాలి 6, పొన్నూరు 3 ఉన్నాయి. ఇక్కడ ఎంబీబీఎస్ అర్హత ఉన్న వైద్యాధికారి, ఏడుగురు ఉద్యోగులు పని చేస్తున్నారు. నిపుణుల సలహా అవసరమైతే టెలీ మెడిసిన్ సౌకర్యం లభిస్తోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేసే ఈ కేంద్రాల్లో ఉచితంగా 60 రకాల రక్త పరీక్షలు చేయించుకునే అవకాశముంది. ప్రభుత్వాసుపత్రుల్లో జరిగే వ్యాధినిరోధక టీకాల సౌకర్యం ఉంది. వైద్యుల సూచన మేరకు మందులు సైతం ఉచితంగా ఇస్తారు.

సంవత్సరం	పొరుగు రోగులు
2022-23	61,033
2023-24	1,04,035
2024-25	5,00,090



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

యూపీహెచ్‌సీల్లో చేసే పరీక్షలు ఇవీ..

సంపూర్ణ రక్త పరీక్ష(సీబీపీ): స్త్రీ, పురుషుల్లో రక్తహీనత ఎక్కువ. దీన్ని తేలికపాటి పరీక్షతో గుర్తించవచ్చు.

మధుమేహం: చిన్నపాటి రక్త పరీక్షతో మధుమేహాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించొచ్చు.

కాలేయ పరీక్షలు (ఎల్ఎఫ్‌టీ): ఇటీవలి కాలంలో హెపటైటిస్ రకం వైరస్‌ల దాడి ఎక్కువైంది. లివర్ వ్యాధులు కూడా బయటపడుతుంటాయి. ఏడాదికోసారి కాలేయం పని తీరు చెప్పే లివర్ ఫంక్షన్ టెస్ట్ (ఎల్ఎఫ్‌టీ) చేయించుకోవడం మంచిది.

కొలెస్ట్రాల్(లిపిడ్ ప్రొఫైల్): మన ప్రాంతంలో గుండె జబ్బులు ఎక్కువ. అధిక కొలెస్ట్రాల్ దీనికి కారణం. దీనిలో మంచి కొలెస్ట్రాల్(హెచ్‌డీఎల్), చెడ్డ కొలెస్ట్రాల్(ఎల్‌డీఎల్), మరో రకం కొవ్వు పదార్థం(ట్రైగ్లిజరైడ్లు) తదితరాలు ఉంటాయి. పాతికేళ్లు దాటితే.. ఏడాదికోసారి ఈ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

☛ మల, మూత్ర పరీక్షలే కాకుండా మరికొన్ని ఉచితంగా చేస్తున్నారు.

ఆరోగ్య కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

సాధారణ జ్వరాలకు, మధుమేహం, అధిక రక్తపోటు వంటి చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు ప్రజలు సర్వజనాసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల వ్యాధి తీవ్రత ఉన్నవారి గురించి ఎక్కువ సమయం కేటాయించడానికి వైద్యులకు సమయం సరిపోవడంలేదు. పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. అవసరమైతేనే అక్కడి వైద్యుల సూచనల మేరకు జీజీహెచ్‌కు రావాలి.
- ఎస్ఎస్‌వీ రమణ, సూపరింటెండెంట్, సర్వజనాసుపత్రి, గుంటూరు

అకాల వర్షం.. అనుకోని కష్టం


తాడేపల్లి మండలం ఉండవల్లిలో కారుమబ్బులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: అకాల వర్షం కారణంగా ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు పాటు జనజీవనం స్తంభించిపోయింది. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వానకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళగిరి, తాడేపల్లి మధ్య ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్ల కొమ్మలు విరిగిపడి రాకపోకలకు అసౌకర్యం కలిగింది. ఉండవల్లిలో అరటి చెట్ల, స్తంభాలు నేలకూలాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు గాలికి పడిపోయాయి.


ఉండవల్లి అంబేడ్కర్‌కాలనీలో గాలికి ఎగిరి కింద పడిన ఇంటిపైకప్పు

బండ్లమ్మకు మహానివేదనలు

చందోలు (పిట్టలవాని పాలెం): చందోలు శ్రీబండ్లమ్మ దేవస్థానంలో నిర్వహిస్తున్న అమ్మవారి తిరునాళ్లలో భాగంగా ఆదివారం ముగింపు రోజు అమ్మవారికి మహానివేదనలు సమర్పించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని శ్రీమహారాజ్ఞికాదేవిగా అలంకరించారు.


శ్రీమహారాజ్ఞికా దేవిగా బండ్లమ్మ

భగీరథునికి మంత్రి లోకేశ్ పూజలు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరిలోని భగరథ మహర్షి జయంతి వేడుకల్లో విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఆదివారం సాయంత్రం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు సగర భగీరథ సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. స్థానికులను మంత్రి ఆప్యాయంగా పలకరించి.. వారితో సెల్ఫీలు దిగారు. పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, తితిదే పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పార్లమెంటు తెదేపా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, సగర భగీరథ మహర్షి సంఘం అధ్యక్షుడు పందేటి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


భగీరథ మహర్షికి నమస్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

ముఖేష్‌కు మరో రెండు బంగారు పతకాలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: భోపాల్‌లో జరుగుతున్న 23వ కుమార్ సురేంద్ర సింగ్ మెమోరియల్ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు షూటర్ ముఖేష్ ఆదివారం మరో రెండు బంగారు పతకాలు సాధించాడు. 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో ముఖేష్ 600కు 575 పాయింట్లు సాధించి రెండు పసిడి పతకాలు కైవసం చేసుకున్నాడు.


బంగారు పతకాలతో ముఖేష్

ఆంధ్రుల వైభవ ప్రతీక.. ఒంగోలు జాతి ఎడ్లు

వడ్లమూడి(చేబ్రోలు), న్యూస్‌టుడే : ఆంధ్రుల వైభవానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీకలని తెదేపా జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర ఆలయం వద్ద దాసరి వీరయ్య చౌదరి మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరు పళ్ల విభాగంలో పోటీలో పాల్గొన్న ఎడ్ల యజమానులకు జ్ఞాపికతో పాటు మామిడి మొక్క ఇచ్చారు. అనంతరం శనివారం జరిగిన 4 పళ్ల విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. పోటీలకు సహకరించిన నాయకులు, కార్యకర్తలను సత్కరించారు.


ఎడ్ల యజమానికి జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యేలు నరేంద్ర కుమార్, శ్రావణ్ కుమార్

నిర్వహణ ఖర్చు తక్కువ

పెదకాకాని, న్యూస్‌టుడే : ఆధునిక వ్యవసాయానికి తగ్గట్టుగా ఐషర్ ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని, వాటి నిర్వహణ ఖర్చు తక్కువగా ఉండి రైతుకు లాభసాటిగా ఉంటుందని ఐషర్ ట్రాక్టర్స్ సౌత్ జోన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సోమశేఖర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేష్ నాయుడు తెలిపారు. గుంటూరు ఆటోనగర్‌లో వారాహి మోటార్స్ షోరూంను డీలర్లు కొంగర అభిలాష్ చౌదరి, పరుచూరి కమలేంద్ర బాబుతో కలిసి వారు ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఐషర్ సంస్థదే తొలి ట్రాక్టర్ అని చెప్పారు. ప్రస్తుతం రైతుల అవసరాలకు తగ్గట్టుగా టూ, ఫోర్ వీల్ డ్రైవ్‌లో ఐషర్ ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు, వ్యాపారులు, ట్రాక్టర్ మెకానిక్‌లు పాల్గొన్నారు.


రైతుతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న సోమశేఖర్, పక్కన రమేష్ నాయుడు, డీలర్లు

శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో దేవాలయ కార్యక్రమాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వైకుంఠపురం [illegible] అధినేత ఎం.శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానిక శ్రీవారి [illegible] పరమేశ్వర దేవస్థానం సత్రం కమిటీ పాత పాలకవర్గ సభ్యులు ఉప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడారు. నూతన పాలకవర్గం ఎన్నికకు జరపాల్సిన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా నూతన పాలకవర్గం ఎన్నికకు ఆదివారం దేవాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సతీష్ కుమార్‌ను శనివారం కలిసినట్లు తెలిపారు. ఆయన సభ్యులందరితో మాట్లాడి కోర్టు తీర్పు వచ్చే వరకు ఆలయ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా జరిపించుకోవడానికి అందరికీ ఆమోదయోగ్యమైన సభ్యుని నియమించుకోవాలని సూచించారని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న సత్రం కమిటీ పాత పాలకవర్గం సభ్యులు వరదరాజులు, శ్రీనివాసరావు

కళాపండగల్లో ప్రేక్షకుల అభినందనలే విందులు


ప్రభావతికి పురస్కారం అందిస్తున్న గోపాలకృష్ణ, అతిథులు


మతమా.. మానవత్వమా నాటికలో ఓ సన్నివేశం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : కళాభిమానులు పెరిగితే కళలకు మరింత ఊపిరి అందుతుందని, ప్రేక్షకుల అభినందనలే విందులుగా కళా పండగలు చిరకాలం కొనసాగుతాయని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరులో జరుగుతున్న ఉభయ రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికోత్సవాల ముగింపు వేడుక ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటి సురభి ప్రభావతి, రంగస్థల రూపశిల్పి వి.శేషగిరిలను పురస్కారాలతో సత్కరించారు. మతమా.. మానవత్వమా, జనరల్ బోగీలు తదితర నాటికలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల ప్రముఖులు, అతిథులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు.

పవన్‌కల్యాణ్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఫిర్యాదు

మంగళగిరి, న్యూస్‌టుడే: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కుటుంబాన్ని కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళగిరి పోలీసులకు స్థానిక జనసేన నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. 'బుల్లెట్‌బాబా' అనే పేరుతో పవన్ కల్యాణ్ సతీమణి, కుమారుడిపై అనుచిత పోస్టు చేసిన వ్యక్తిపై నాయకుడు జొన్నా రాజేష్, పవన్ తల్లిదండ్రులను కించపరిచిన మరో వ్యక్తిపై జనసేన మండలాధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకుడు జొన్నా రాజేష్

మహిళా వసతి గృహంలో సీసీ కెమెరాల కలకలం

❑ స్నానాల గది బయట ఉండడంపై విద్యార్థినుల అభ్యంతరం ❑ నిర్వాహకుడి తీరుపై పోలీసులకు ఫిర్యాదు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: గుంటూరులో ఓ మహిళా వసతి గృహంలో నిర్వాహకులు అభ్యంతరకర ప్రదేశాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం కలకలం రేపింది. ఈ వ్యవహారం పోలీస్ స్టేషన్ వరకు చేరింది. దీనిపై పోలీసులు హాస్టల్ నిర్వాహకులను విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన గుర్రం ప్రసాద్, శారద దంపతులు 20 రోజులుగా గుంటూరు బ్రాడీపేట నాలుగో లైనులో శ్రీనివాస లేడీస్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. 60 మంది వరకు విద్యార్థినులు ఆ వసతి గృహంలో ఉంటున్నారు. హాస్టల్ నిర్వహణకు తీసుకున్నాక ప్రసాద్ కారిడార్లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాడు. కారిడార్‌లో ఉన్న సీసీ కెమెరా ఒకటి స్నానాల గది నుంచి బయటకు వచ్చేటప్పుడు కవర్ చేస్తుంది. స్నానం చేసి టవల్ చుట్టుకుని వచ్చే సమయంలో ఇది ఇబ్బందిగా ఉంటుందని, కారిడార్‌లో పెట్టిన సీసీ కెమెరా తొలగించాలని కోరారు. దీనికి ప్రసాద్ అంగీకరించలేదు. భద్రత నిమిత్తం ఏర్పాటు చేశామని, తొలగించడం కుదరదని, ఇష్టమైతే ఉండండి. . లేదంటే వెళ్లిపోండని తెగేసి చెప్పాడు. ఓ విద్యార్థిని ఊరు వెళ్లేటప్పుడు ఆమె అడగకపోయినా బస్టాండ్‌లో దింపి.. వీలున్నప్పుడు ఫోన్ చేయమని నంబర్ ఇచ్చాడు. అంతేగాకుండా ఫోన్ చేసి అభ్యంతరకరంగా మాట్లాడుతున్నాడు. ఈ విషయాన్ని ఆ విద్యార్థిని.. ప్రసాద్ భార్య శారదకు తెలియజేసినా.. ఆమె ఫీజు కోసం చేసి ఉంటారని వంత పాడారు. దీంతో పిడుగురాళ్లకు చెందిన నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినితో పాటు కొందరు విద్యార్థినులు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ బానోదయ వసతిగృహానికి చేరుకుని విచారించారు. అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి హాస్టల్ నిర్వాహకులు ప్రసాద్, శారదను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: వ్యక్తి హత్య కేసులో మొత్తం అయిదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని పేరేచర్ల శివారు పొలాల్లో గత నెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం మంగళగిరికి చెందిన ఇట్టా బాలకృష్ణ(45) దారుణహత్యకు గురయ్యాడు. ఆ రోజు అతడితోపాటు బంధువులు, మిత్రులైన మరో అయిదుగురు వ్యక్తులు ఉన్నట్లు నిర్ధారించారు. అందరూ కలిసి మద్యం తాగారు. ఆ సమయంలో వారి మధ్య ఒక విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో బీరు సీసాలతో కొట్టి బండరాయితో మోదడం వల్ల బాలకృష్ణ మృతి చెందాడని పోలీసులు నిర్ధారించారు. వారు మంగళగిరి, ఫిరంగిపురం, కాకుమాను, ప్రకాశం జిల్లా త్రిపురాంతకం ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా కనిపెట్టారు. వారిలో నలుగురు ఇప్పటికే పోలీసుల అదుపులో ఉండగా పరారీలో ఉన్న అయిదో వ్యక్తిని కూడా ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. త్వరలో నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరుస్తారని సమాచారం.

నకిలీ బంగారం తాకట్టుపెట్టి రూ.9 కోట్లు రుణాలు

ఆడిట్‌లో గుర్తించిన బ్యాంకు అధికారులు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి కరూర్ వైశ్య బ్యాంకులో నకిలీ బంగారు నగలను తనఖా పెట్టి సుమారు రూ.9 కోట్ల రుణాలు పొందిన ఘటనపై బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ పోలీసుల్ని ఆశ్రయించారు. పోలీసులు, బ్యాంక్ మేనేజర్ తెలిపిన వివరాల మేరకు. .స్థానిక గౌతమబుద్ధా రోడ్డులోని బ్యాంక్‌లో గత కొంతకాలంగా నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందుతున్నారు. మంగళగిరికి చెందిన బంగారం వ్యాపారం నిర్వహించే ప్రకాష్, ఇక్కడి అప్రైజర్ మదన్‌కుమార్ కుమార్ కుమ్మక్కై దాదాపు 47 మందితో బ్యాంకులో ఖాతాలు తెరిపించి వాటి ద్వారా నకిలీ బంగారం తాకట్టు పెట్టి నగదు రూ.9 కోట్ల మేర రుణాలు తీసుకున్నారని మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. గత వారంలో బ్యాంకు ఆడిట్ నిర్వహించిన నేపథ్యంలో ఈ వ్యవహారం బయటపడింది. నకిలీ బంగారానికి పూత పూసి అసలు నగలుగా చూపించినట్లు బ్యాంకు అధికారులు పోలీసులకు వివరించారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఇక్కడ పనిచేసిన మేనేజర్ బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. అసలు దీనివెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది.. బ్యాంకు సిబ్బంది ఎవరైనా సహకరించారా..? అన్న కోణంలో ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేతన సవరణ బోర్డు ఏర్పాటు చేయాలి

మాచర్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా కార్మిక సంక్షేమానికి చర్యలు తీసుకోలేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు అన్నారు. ఆదివారం మాచర్ల పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఒప్పంద, పొరుగు సేవల విధానాల్లో లక్షల మంది కార్మికులకు వేతన సవరణ బోర్డు ఏర్పాటు చేయలేదని చెప్పారు.

తెనాలి-నిడుబ్రోలు రైల్వే మార్గంలో అయిదు ఆర్వోబీలు: ఎంపీ

వేమూరు, చుండూరు, న్యూస్‌టుడే: తెనాలి-నిడుబ్రోలు రైల్వే మార్గంలో ప్రజలు, రైతుల రవాణా సౌకర్యార్థం ఐదు ఆర్వోబీల నిర్మాణానికి రూ.251కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. నియోజకవర్గంలోని చుండూరు, మోదుకూరు రైల్వేస్టేషన్లను ఎమ్మెల్యే ఆనందబాబు, విజయవాడ డీఆర్ఎం మయాంక్‌ఉషోదయ్‌తో కలసి ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎంపీ నిధులతో వేమూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేసి, కేంద్ర మంత్రులకు అందజేశామని, నారాకోడూరు నుంచి నిజాపట్నం వరకు 55 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణానికి రూ. 1200 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపామన్నారు. 216ఏ జాతీయ రహదారి బాపట్ల నుంచి రేపల్లె వరకు ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉందని, దాన్ని నాలుగు లైన్లు చేయడానికి రూ.1200కోట్ల నిధులు అవసరమని సంబంధిత కేంద్ర మంత్రిని కోరినట్లు వివరించారు. తెనాలి-రేపల్లె రైల్వే మార్గంలో రెండో లైన్ కోసం సంబంధిత అధికారుల ద్వారా నివేదికలు పంపినట్లు తెలిపారు. రేపల్లె-తెనాలి రైల్వే మార్గంలో వేమూరు, భట్టిప్రోలు వద్ద రెండు ఆర్వోబీలు కావాలని కోరినట్లు చెప్పారు. విజయవాడ నుంచి గూడూరు వరకు నాలుగో రైల్వే లైన్ కోసం రూ. 2వేల కోట్లు మంజూరు చేయాలని రైల్వే మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఇక మచిలీపట్నం నుంచి రేపల్లె, రేపల్లె నుంచి బాపట్లకు నూతన రైలుమార్గం ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ||కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, రిటైల్ ధర - 162, చికెన్ విత్‌స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -142 రిటైల్ ధర 164 చికెన్ విత్ స్కిన్ - 238, చికెన్ స్కిన్‌లెస్ - 271.


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 145, 154, 165 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 500 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 78/-.

వైభవంగా ఉత్తరాధిపతి పట్టాభిషేక మహోత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీమహాకామేశ్వరీ ధర్మ పరిపాలన సంఘం ఆధ్వర్యంలో గుంటూరు అరండల్‌పేట 4/2లోని శ్రీశృంగేరి విరూపాక్ష శ్రీపీఠంలో మూడు రోజులుగా శ్రీభారతీ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా పీఠానికి ఉత్తరాధిపతిగా పర శివానంద భారతి స్వామిని ప్రస్తుత పీఠాధిపతి గంభీరానంద స్వామి ఆదివారం అభిషేకించారు. పీఠ శిష్యులు ఎస్వీఎస్ సోమయాజి అక్షరాంజలి జ్ఞాపికను గంభీరానంద భారతి స్వామి ద్వారా నూతన ఉత్తరాధిపతికి అందించారు. ఈసందర్భంగా గంభీరానంద భారతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ శంకర జయంతి, విద్యారణ్య భారతి స్వామి జయంతి, ప్రతాప భారతి అమ్మవారి ప్రతిదిన పట్టాభిషేక సంకల్పం, పట్టాభిషేకం శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు నిర్వహించామన్నారు. సోమవారం కల్యాణానంద భారతి మాంతాచార్య మహాస్వామి జయంతి నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఠ శిష్యులు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, పరమహంస, చింతలపాటి వెంకటరామయ్య, ఆర్. లక్ష్మీపతి, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తరాధిపతికి అక్షరాంజలి జ్ఞాపిక సమర్పణ

తెనాలి
•తెనాలి •పొన్నూరు

సుబ్రహ్మణ్య స్వామి సేవలో ఆలపాటి

మోపిదేవి, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కుటుంబ సమేతంగా ఆదివారం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నాగదేవ తను కొలిచి పూజలు సమర్పించారు. స్వామికి సిల్క్ హించిన పంచామృతాభిషేకంలో పాల్గొన్నారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు చిత్రపటం, ప్రసాదాలు అందించి శేషవస్త్రంతో సత్కరించారు.



రాజేంద్ర ప్రసాద్‌కు స్వామి చిత్రపటం అందిస్తున్న శ్రీరామవరప్రసాదరావు

బాధిత కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని ఉండవల్లిలో ఆదివారం ఉదయం గాలివానకు దీకొల్లు చైతన్య ఇంటి పైకప్పు దెబ్బతింది. మంత్రి లోకేశ్ స్పందించి బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆదివారం స్థానిక తెదేపా నాయకులు చైతన్యకు అందించారు. తెదేపా ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతి బసు, నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాయపూడి కిరణ్, వల్లభాపురం శంకర్, బసివిరెడ్డి, దాసరి కృష్ణ, తోట సాంబశివరావు, లీలా కృష్ణ పాల్గొన్నారు.



బాధితుడికి సాయం అందిస్తున్న తెదేపా నాయకులు

దైవ నామస్మరణతో మానసిక ప్రశాంతత



భూమి పూజలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే : దైవ నామస్మరణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధి జీబీసీ రోడ్డులోని శ్రీసుందర వల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణ స్వామి దేవాలయంలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న పురాణ కాలక్షేప మండపానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ అధికారులు సత్కరించారు. సహాయ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాటలకే పరిమితం.. ఆచరణ శూన్యం

- కలగా రైతు బజారు ఏర్పాటు
- ప్రైవేటు వ్యాపారులతో నష్టపోతున్న వినియోగదారులు

న్యూస్‌టుడే, పొన్నూరు

గత వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు నియోజకవర్గాల పరిధిలో, కనుక్కు... జీబీసీ రోడ్డులో మినీ రైతు బజారులు ఏర్పాటు చేస్తామని ఆనాటి వైకాపా నేతలు ఆర్భాటంగా ప్రకటించారు. ఆ మాటలు మాత్రం కార్యరూపం దాల్చలేదు. పట్టణ పరిధిలోని విద్యానగర్‌లో 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రైతుబజారును ఏర్పాటు చేసింది. అందులో ప్రతి రోజూ 30 నుంచి 35 టన్నుల కూరగాయలను విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

రవాణా సౌకర్యం లేదు

ఇది పాత పొన్నూరు, అబ్దుల్‌కలాం రోడ్డు, సాంబశివనగర్, వైష్ణవినగర్, భావనగర్, నిడుబ్రోలు తదితర ప్రాంతవాసులకు దూరం అయినట్లు పలువురు తెలుపుతున్నారు. ఇక్కడికి రాకపోకలు సాగించేందుకు సరైన రవాణా సౌకర్యం లేదని ఆవేదన చెందుతున్నారు. దీంతో

పట్టణం	: పొన్నూరు
వార్డులు	: 31
కుటుంబాలు	: 18,005
జనాభా	: 61,500



ఆయా కాలనీ వీధుల్లోకి వచ్చిన ప్రైవేటు వ్యాపారుల వద్ద కూరగాయలను కొనుగోలు చేస్తున్నట్లు మహిళలు చెబుతున్నారు. ఒక్కో రోజు నాణ్యత లేని కూరగాయలను కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. దీంతో వ్యాపారి చెప్పిన ధరకే కొనాల్సి వస్తుందని స్త్రీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తూకంలో మోసాలు జరుగుతున్నా..

దీంతో పాటు కొంతమంది వ్యాపారుల వద్ద ఉన్న తూకంలో తేడాలు వస్తున్నాయని, కూరగాయలు కొనేటప్పుడు మోసాలు జరుగుతున్నా చేసేది లేక తీసుకుంటున్నట్లు మహిళలు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో రైతుబజారులు ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం

రైతుబజారు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు ఎటువంటి ప్రతిపాదనలు అందించమని కోరలేదు. వారి నుంచి ఆదేశాలు రాగానే ప్రతిపాదనలు పంపుతాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– రమేష్‌బాబు, రైతుబజారు పర్యవేక్షణాధికారి, పొన్నూరు

కొలకలూరు.. సమస్యలకు నెలవు

మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తెనాలి నియోజకవర్గంలో మేజర్ పంచాయతీ అయిన కొలకలూరు గ్రామంలో ఎక్కడా సమస్యలు కొలువై తీరి పరిష్కారానికి నోచడం లేదు. గ్రామంలో కంపోస్టు యార్డు లేకపోవడంతో ప్రతి రోజూ సేకరించే వ్యర్థాలన్నీ రహదారి పక్కనే పడేస్తున్నారు. ప్రధాన కాలువ సరిగా లేకపోవడంతో పలు కాలనీల్లో మురుగు నిల్వ ఉంటోంది. మరోవైపు నిత్యం తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయి. పాత, కొత్త పైపుల అనుసంధానం, మురుగు నీటిలోనే మంచినీటి పైపులతో తరచూ నీరు కలుషితం అవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక మరింత విస్తరించాలన్న ప్రతిపాదన ఉన్న రోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయి బస్సుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ఇలా ప్రజలకు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డు మీదే వ్యర్థాలు



వంతెనపై పెరిగిన పిచ్చి మొక్కలు

నిర్వహణ గాలికొదిలేశారు

తెనాలి నుంచి నందివెలుగు మీదుగా గుంటూరు వెళ్లడానికి ప్రధాన మార్గంగా ఉన్న కొలకలూరు వంతెన నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో వారధిపైన పిచ్చి మొక్కలు పెరిగాయి. వీటితో పాటు వంతెన కింద, ఖాజీపేట మార్గంలో బహిరంగ మద్యపానం, మందుబాబుల హల్‌చల్‌లతో సాయంత్రం అయితే ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొలకలూరుపై దృష్టి సారించి ప్రజల ఇబ్బందులను తీర్చాల్సిన అవసరం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు 8 వార్డులో సిమెంటు రోడ్డు నిర్మించలేదు. మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది. తగు చర్యలు తీసుకోండి. - పి.రంగనాథ్, సానికుడు

✔ నిధులు మంజూరు కాగానే సీసీ రోడ్డు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం. - జంగం అపర్ణ, సహాయ ఇంజినీర్

? పట్టణ పరిధి విద్యానగర్‌లోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. - ఎన్.బాలాజీ, విద్యానగర్

✔ వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - శ్రీనివాసరావు

? నందివెలుగు గ్రామంలోని రైస్‌మిల్లు పక్కన చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలపైకి వాలాయి. - స్థానికులు

✔ కొమ్మలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

? పెదరావూరులోని పశు వైద్యశాల రోడ్డులో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. - స్థానికులు

✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - పై ప్రశ్నలకు విద్యుత్తు విభాగ డీఈఈ అశోక్ కుమార్ సమాధానాలు ఇచ్చారు.

? తెనాలి పట్టణ ముత్యంశెట్టిపాలెంలో వైకుంఠపురం మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. - ఆంజనేయులు, స్థానికుడు

✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం. - బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్

మేమున్నాం...మీకు తోడుగా శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని 14వ వార్డు ప్రధాన రహదారిలో పేరుకున్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు

– న్యూస్‌టుడే, పొన్నూరు, తెనాలి టౌన్

స్పందనకు వందనం

సామాజిక బాధ్యత అందరిది



ముక్తేశ్వరరావును సత్కరిస్తున్న మానవత సభ్యులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : సామాజిక బాధ్యత అందరిదని విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెనాలిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఛైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్, రీజనల్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, అధ్యక్ష, కార్యదర్శులు ఓంకార్ ప్రసాద్, వెంకట్, సోమయ్య శాస్త్రి, ఎస్.వీ.శర్మ, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. సహజ కవి అయినాల మల్లేశ్వరరావు రచించిన సూక్తినిధి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ముక్తేశ్వరరావును సత్కరించారు.

దేవాలయానికి బల్లల వితరణ

పెదకాకాని, న్యూస్‌టుడే : స్థానిక మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల కూర్చునేందుకు రూ.లక్ష విలువైన ఎనిమిది స్టీల్ బల్లలను తక్కెళ్లపాడుకి చెందిన నందిపాటి కోటేశ్వరరావు, అరుణకుమారి దంపతులు ఆదివారం అందజేశారు. ఈ మేరకు స్వామిని దర్శించుకున్న అనంతరం దాతలకు ఈవో గోగినేని లీలాకుమార్ స్వామి చిత్రపటం, ప్రసాదాలు ఇచ్చారు.



దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఈవో లీలాకుమార్

వైభవంగా దుక్కి దేవమ్మ తల్లి తిరునాళ్ల

పొన్నూరు, న్యూస్‌టుడే : మండల పరిధి వెల్లలూరు గ్రామంలోని దుక్కి దేవమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనుల పండువగా సహస్ర కలశాభిషేకం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : తెనాలి మండలం అంగలకుదురు దాసుకుటి పీఠంలో ఆదివారం సహస్ర కలశాభిషేకం కనుల పండువగా జరిగింది. శ్రీసీతారాముల వారికి పీఠాధిపతి సీతారామదాసు స్వామి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రసాదాలు స్వీకరించారు.



అభిషేక పూజలో పీఠాధిపతి సీతారామదాసు స్వామి

అన్నమయ్య పాటల పోటీలు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : అన్నమయ్య జయంతి సందర్భంగా శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గీతామందిరంలో పాటల పోటీలు నిర్వహించారు. ఐదులో జూనియర్, సీనియర్ విభాగాలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏఎస్ఎన్ మ్యూజిక్ విభాగాధిపతి చింతలపాటి మంజుల న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కొండపి శ్రీనివాసరావు, వసుంధర, శారద, కనకదుర్గ, లక్ష్మీ రంజని, రమాదేవి, సావిత్రి, బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు..

పొన్నూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీసుందర వల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారి మూల విరాట్టు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



అలంకరణలో ఉత్సవ మూర్తులు

క్రీస్తు మార్గం అనుసరణీయం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: క్రీస్తు మార్గం అనుసరణీయమని విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాల అన్నారు. అబ్బినేనిగుంట పాలెం వేళాంగిణిమాత ఆలయంలో జరుగుతున్న తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా 2వ రోజు ఆదివారం ఆలయంలో దివ్యపూజా బలి, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వాసులనుద్దేశించి ఆయన సందేశమిచ్చారు. పీఠాధిపతులు భాగ్యయ్య (గుంటూరు), ఆంతోనిదాస్(నెల్లూరు), విశ్రాంత పీఠాధిపతి గాలిబాలి (కడప), ఆలయ విచారణగురువు బల్తజార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన వర్షం

పొన్నూరు, న్యూస్‌టుడే : పొన్నూరులో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో నండూరు, ములుకుదురు, మునిపల్లె, మామిళ్లపల్లి తదితర ప్రాంతాల్లో ఆరబోసిన మొక్కజొన్నలపై రైతులు పట్టాలు కప్పారు. చింతలపూడి, మాచవరం, ములుకుదురు తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులు వీయడంతో తమలపాకు తోటలు దెబ్బతిన్నాయని పలువురు ఆందోళన చెందారు. ఇప్పటికే తమలపాకుకు ధర లేక పోవడంతో కొనుగోలు నిలిచింది.

కొల్లిపర, న్యూస్‌టుడే : మండల పరిధిలోని మున్నంగి, వల్లభాపురం తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఎండపెట్టిన పసుపు, మొక్కజొన్న, జొన్నలను కాపాడుకునేందుకు రైతులు శ్రమించాల్సి వచ్చింది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వర్షం పడింది.



కొల్లిపరలో మొక్కజొన్నలను ఇళ్లకు తరలిస్తున్న రైతులు

కేజీఎఫ్ కార్యాలయం ప్రారంభం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రకాశం బజారులో కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ కార్యాలయాన్ని సంఘ తెనాలి అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సంస్థ లోగోను ఆవిష్కరించారు. నాగభూషణం, నాగేశ్వరరావు, బాపయ్య, అంకినీడు, శంకర ప్రసాద్, ప్రవీణ్, సాయి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.



సంస్థ లోగో ఆవిష్కరించిన అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణప్రసాద్, అతిథులు

దార్శనికుడు నారాయణరావు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : సినీ దర్శకుడు దివంగత దాసరి నారాయణరావు దార్శనికుడని మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా అన్నారు. ఆదివారం పట్టణంలోని మా ఏపీ కార్యాలయం వద్ద నిర్వహించిన దాసరి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాసరి దర్శకత్వంలో వచ్చిన సినిమాలకు లభించిన అపూర్వ ప్రజాదరణను విశదీకరించారు. అనంతరం నారాయణరావు చిత్రపటం వద్ద ప్రసాద్, మణివరన్, గురవయ్య నివాళులర్పించారు.



దాసరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దిలీప్‌రాజా తదితరులు

రోడ్డు నిర్మాణ పనులు షురూ

పొన్నూరు- చందోలు రహదారి నిర్మాణ పనులను ఎట్టకేలకు ఆదివారం ప్రారంభించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం దీనికి రూ.9 కోట్లు మంజూరు చేసింది. వైకాపా హయాంలో రోడ్డు నిర్మాణ పనులకు మూడేళ్ల కిందట రూ.8 కోట్ల నిధులు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించ లేదు. దీంతో గోతులమయంగా మారిన రహదారిపై వాహనదారులు పలు ప్రమాదాలకు గురయ్యారు. ప్రస్తుతం ఆయా పనులు ప్రారంభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



– న్యూస్‌టుడే, పొన్నూరు

గుంతల దారి.. జాగ్రత్త మరి..!

మండల పరిధి జీబీసీ రోడ్డు నుంచి నండూరు గ్రామానికి వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. కొంతమేర రోడ్డు ఎత్తు పల్లంగా ఉండటంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో అయితే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగక ముందే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, పొన్నూరు

మురుగు కదలదు.. దోమలు వదలవు



పట్టణ పరిధి లక్ష్మీనగర్‌లోని కాలువలో మురుగు కదలక నీరు పొంగి రోడ్డుపై పొర్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, దోమకాటు భరించలేక పోతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి మురుగు పారుదలకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

కాలిబాట శిథిలం.. ప్రయాణం ప్రమాదం

దావులూరు గ్రామం సమీపంలోని బూతిమిల్లి కాల్వపై నిర్మించిన కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో బాటసారులు, ద్విచక్ర వాహన దారులు ప్రమాదం అంచున ప్రయాణించాల్సి వస్తోంది. దావులూరు, చక్రాపాలెం తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కొల్లిపర, తెనాలి వెళ్లేందుకు ఈ వంతెననే వినియోగించాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, కొల్లిపర





పరీక్షా కేంద్రం వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

సజావుగా నీట్ పరీక్ష

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : తెనాలిలో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో 240 మందికి గాను 7 గురు, కెవిఎస్ఎమ్ కేంద్రంలో 212 మందికి గాను 8 మంది గైర్హాజరు అయినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.



తనిఖీల అనంతరం విద్యార్థులను పంపుతున్న సిబ్బంది

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చేబ్రోలు, న్యూస్‌టుడే : రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పొన్నూరు గ్రామీణ సీఐ కోటేశ్వరరావు వివరాల మేరకు.. చేబ్రోలుకు చెందిన గోపీ గిరిధర్ చౌక బియ్యం వ్యాపారి. అతను మండలంలోని సుద్దపల్లి గ్రామం నుంచి బాపట్ల జిల్లా చుండూరు మండలంలోని ఓ రైస్‌మిల్లుకు 70 బస్తాలు తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు శనివారం అర్ధరాత్రి మంచాల అడ్డరోడ్డు వద్ద వాహనాన్ని స్వాధీనం చేసుకుని చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనానికి ఎదురు నంబరు బోర్డు తొలగించి, రేషన్ గోతాలతో సహా తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో వాహనంతో పాటు డ్రైవర్ శ్రీను, వ్యాపారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. బియ్యం బస్తాలను నేరుగా సుద్దపల్లిలోని ఓ రేషన్ దుకాణం నుంచి తరలిస్తున్నట్టు సమాచారం.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో కార్మికుడి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న గోపి(36) పట్టణ పాండురంగపేటలోని తన ఇంటిలో శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని మూడో పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌లతో పాటు మద్యానికి బానిసగా మారిన గోపి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని వివరించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పట్టణ సుల్తానాబాద్‌లో శనివారం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇరువురు యువతులు గాయపడ్డారు. అయితే తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు ఆదివారం తెలిపారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పట్టణ పినపాడు శివారులో ఆదివారం బహిరంగ మద్యపానం చేస్తున్న వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

కరాటేతో ఆత్మరక్షణ

మంగళగిరి, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ కోసం కరాటే తప్పనిసరని సీఐడీ ఎస్పీ కడియం చక్రవర్తి అన్నారు. మంగళగిరిలోని మార్షల్ ఆర్ట్స్ అండ్ కరాటే కోచింగ్ సెంటర్‌లో ఆదివారం కరాటే బెల్టు టెస్ట్ నిర్వహించారు. దాదాపు వంద మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. సీనియర్ మాస్టర్ జీవి నరసయ్య, జపాన్ సిటోరియో టెక్నికల్ డైరెక్టర్ గంజి కులశేఖర్, జపాన్ సుటోరియో ఏపీ జనరల్ సెక్రటరీ ప్రభాకర్ పాల్గొన్నారు.

బాలిక అపహరణ కేసులో నిందితుల అరెస్టు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అపహరించిన కేసులో యువకుడితో పాటు అతడికి సహకరించిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. బాలికను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి..కొద్ది రోజుల కిందట అపహరించుకుని వెళ్లాడు. మూడు రోజుల తర్వాత ఇంటికి వచ్చిన బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యువకుడితోపాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వారిలో ముగ్గుర్ని అదుపులోకి తీసుకోగా.. మరో యువకుడు పరారీలో ఉన్నాడు. నిందితులను శనివారం గుంటూరు ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని పోలీసులు తెలిపారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? దుగ్గిరాల రథశాల నుంచి వ్యవసాయశాఖ కార్యాలయం వరకు రోడ్డు దయనీయంగా ఉంది. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. నడవలేక పోతున్నాం. **-సీహెచ్. రామకృష్ణ, దుగ్గిరాల**

✔ పంచాయతీ వద్ద ప్రస్తుతం ఉన్న నిధులతో రోడ్డు కొత్తగా వేసే పనులు వారం, పదిరోజుల్లో మొదలు పెడతాం. **-బాణావత్ కుషీబాయి, సర్పంచి - న్యూస్‌టుడే, దుగ్గిరాల**

? ప్రత్తిపాడులో మల్లాయపాలెం రోడ్డు వీధిలో చెత్త, వ్యర్థాలను కుప్పలుగా పడేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు నరకం చూపుతన్నాయి. **-స్థానికులు, ప్రత్తిపాడు.**

✔ పారిశుద్ధ్య కార్మికులతో తొలగింపజేస్తాం. **-షేక్.ఖాజా, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ప్రత్తిపాడు.**

? వంగిపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డులో మురుగు కాల్వల పూడిక తీయడం లేదు. మురుగు నీరు రోడ్డుపై నిలుస్తున్నాయి. **- సాయి కుమార్, వంగిపురం.**

- ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

✔ ఎప్పటికప్పుడు కాల్వల పూడిక తీయిస్తాం. **- పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, వంగిపురం.**

? తిక్కిరెడ్డిపాలెంలో శీతలగిడ్డంగికి వెళ్లే దారిలో చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. పూడిక తీయించండి. **-స్థానికులు, తిక్కిరెడ్డిపాలెం.**

✔ చెత్త, వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయిస్తాం. **-మాధవి, పంచాయతీ కార్యదర్శి, తిక్కిరెడ్డిపాలెం.**

- పెదనందిపాడు, న్యూస్‌టుడే

? పెదనందిపాడు 1వవార్డులోని ప్రధాన వీధి మధ్యలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

✔ పరిశీలించి వ్యర్థాలను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటాం. **- శ్వేత, పంచాయితీ కార్యదర్శి, నాగులపాడు**

? నాగులపాడు చెరువులో తూర్పు వైపు జమ్ము దట్టంగా పెరిగింది. జమ్ము తొలగించి శుభ్రం చేయాలి. **- గ్రామస్థులు**

✔ చెరువును పరిశీలించి శుభ్రం చేయిస్తాం. దుర్వాసన లేకుండా బ్లీచింగ్ చల్లిస్తాం. **-శ్వేత, ఇన్‌ఛార్జి పంచాయితీ కార్యదర్శి,**

? తుళ్లూరు గ్రామ శివారు రాయపూడి వెళ్లే మార్గంలో మురుగు కాలువలో పూడిక తీయించి వ్యర్థాలు తొలగించాలి. రాత్రి వేళల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. **-రమేష్**

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి జేసీబీ సహాయంతో కాలువలో పూడిక తీయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్‌చేయిస్తాం. **-ఆర్.రమణ, పంచాయతీ కార్యదర్శి - తుళ్లూరు, న్యూస్‌టుడే**

వైద్య శిబిరాలకు స్పందన

ఫిరంగిపురం గ్రామీణం: నుదురుపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో కళ్లు, ముక్కు, గొంతు, చెవులు పరీక్షలు జరిగాయి. మొత్తం 527 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ షేక్ మీరావలి, కరస్పాండెంట్ షేక్ కరీం మొహిద్దీన్ పాల్గొన్నారు.

తాడికొండ: శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో తాడికొండ గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా 98మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

నాయకుల నివాళి

మంగళగిరి: చినకాకానిలో మేడే ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం గ్రామపార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత యార్లగడ్డ సుబ్బారావు విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 25 ప్రాంతాల్లో పార్టీ పతాకాలను నియోజకవర్గ కార్యదర్శి చిన్నితిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జలాది జాన్‌బాబు ఆవిష్కరించారు.

గుట్టలు, క్వారీలపై హక్కులు కల్పించండి

మంగళగిరి, న్యూస్‌టుడే: గుట్టలు, క్వారీలపై వడ్డెర్లకు హక్కులు కల్పించాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దయాకర్ కోరారు. మంగళగిరి వృత్తిదారుల సంఘం కార్యాలయంలో ఆదివారం జిల్లా వడ్డెర వృత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. శ్రీరాములు సమావేశానికి అధ్యక్షత వహించారు. అత్యంత పేదరికంలో జీవించే వడ్డెర్లను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కన్వీనర్ ఈమని అప్పారావు కోరారు. ఈ సందర్భంగా జిల్లా వడ్డెర వృత్తిదారుల సంఘానికి 8 మందితో కమిటీ ఎంపికైనట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా శంకర్, కార్యదర్శిగా శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సుబ్బరాయుడు ఎన్నికైనట్లు ప్రకటించారు.

కొనేవారు లేక.. కోలుకోలేక

పొగాకు రైతుల దీనస్థితి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

భూమిని నమ్ముకుని పంటను సాగు చేసిన రైతులు దీనస్థితిని ఎదుర్కొంటున్నారు. గతేడాది మాదిరి ధర ఆశాజనకంగా ఉంటుందని ఆశించారు. లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పొగాకు పంటను సాగు చేశారు. తుపానులు, తెగళ్ల బారి నుంచి పంటను కాపాడి దిగుబడి సాధించిన రైతులు చివరకు పంటను కొనుగోలు చేసేవారు లేక దిగాలు చెందుతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో పొగాకు నారు నాటిన గతేడాది నవంబరు నెలాఖరు, డిసెంబరు మొదటి వారంలో రెండు వారాల పాటు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. ఎకరాకు రూ.10వేలు, నాటినందుకు రూ.5వేలు ఖర్చుచేసి నాటిన నారు దెబ్బతింది. మళ్లీ నారు తెచ్చి నాటి పంటను కాపాడుకుంటూ వచ్చారు. నారు కొనుగోలు, నారు నాటడం, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయం, పొగాకు తొలిచి తాళ్లు కట్టి ఎండబెట్టటానికి ఎకరాకు రూ.80వేల నుంచి రూ. లక్షకు వరకు పెట్టుబడి పెట్టారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే పంటను కొనుగోలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోతే ఎలా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..
పొగాకు పంట విస్తీర్ణం: 38 వేల ఎకరాలు
రైతులు: సుమారు 2,550 మంది



పాతమల్లాయపాలెం: పాకలో నిల్వ చేసిన పొగాకు

కొనుగోలు చేసేందుకు ఒక్కరూ రావడం లేదు

నాకు ఒక ఎకరం సొంత పొలం ఉంది. మరో 14 ఎకరాలను ఎకరం రూ.20 వేలకు కౌలుకు తీసుకుని పొగాకు పంట సాగు చేశాను. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. పది క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. మిగిలిన పంట ఎండపెట్టాను. దాదాపు 60 క్వింటాళ్ల పొగాకు బేళ్లు కట్టి నిల్వ చేసి ఉంచాను. కొనుగోలు చేసేందుకు ఒక్కరూ రావడం లేదు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

- గంగయ్య, రైతు, తిమ్మాపురం

250 బేళ్లు నిల్వ చేశా..



పొగాకు పంటను కొనుగోలు చేసేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. గతేడాది జులైలో ఓ కంపెనీ ప్రతినిధులు వచ్చి పొగాకు సాగు చేయండి మేము కొనుగోలు చేస్తామని బాండ్లు రాసుకుని వెళ్లారు. ఆ బాండ్లు మాకు ఇవ్వలేదు. నాలుగు రోజుల క్రితం ఓ కంపెనీ వారు వచ్చి 20 బేళ్లను క్వింటా రూ.14 వేలు చొప్పున కొనుగోలు వెళ్లారు. ఇంకా 250 బేళ్లు నిల్వ ఉన్నాయని చెబితే వద్దని వెళ్లిపోయారు.

- కాసు వీరారెడ్డి, రైతు, పాతమల్లాయపాలెం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గోకరాజు గంగరాజు, చిత్రంలో ఆక్వా డెవిల్స్ అధ్యక్షుడు రామకృష్ణ

చిన్నారులకు ఈత శిక్షణ అభినందనీయం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఈత చిన్నారుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. అమరావతి కరకట్ట మార్గంలోని ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన వేసవి ఈత శిక్షణ శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈతకొలనులో బాలలకు వేసవి శిక్షణ ఇవ్వనున్నారు. గత 17 ఏళ్లుగా పిల్లలకు ప్రతి ఏటా ఈతలో శిక్షణ ఇస్తున్న ఆక్వా డెవిల్స్ నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఆక్వా డెవిల్స్ అధ్యక్షుడు లింగిపిల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు అయిదు వేల మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యదర్శి వైవీ రమేష్‌కుమార్, కోశాధికారి రామయ్య, కన్వీనర్ జోజిబాబు, ఉపాధ్యక్షుడు గోపాలం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టు పంటతో మేలైన ఆదాయం



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పట్టు పంట సాగుచేస్తే రైతులు బాగా దాయం పొందవచ్చని గుంటూరు, పల్నాడు జిల్లా పట్టుపరిశ్రమ అధికారి ఎ. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పెదనందిపాడు మండలం వరగాని దేవాలయం ఆవరణలో ఆదివారం జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏడాదికి ఎకరాకు నాలుగు సార్లు దిగుబడి వస్తుందని పెట్టుబడి ఎకరాకు రూ. 40 వేలు ఖర్చవుతుందని అన్నారు. 75వేలు వస్తుందన్నారు. అయితే రైతులు సామూహికంగా పట్టు, మల్బరి సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం రాయితీలతో అనేక వసతులు కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక అధికారి కిషన్‌రావు, ఉద్యాన విభాగ సహాయకులు బిబీశాలిని, ఎపీఎ వి. రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తూటాకును వెంటనే తొలగించండి

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం కాజ - కంఠంరాజుకొండూరు మధ్య సాగునీటి కాలువలో పేరుకుపోయిన తూటాకును మంత్రి నారా లోకేశ్ ఆదివారం పరిశీలించారు. కంఠంరాజుకొండూరులో మహంకాళి అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని తిరిగి వస్తూ ఆయన కాలువను గమనించి వాహనాన్ని నిలుపుదల చేసి పరిశీలించారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున కాలువను శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య ఉన్నారు.



కాలువను పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేశ్, పక్కన నందం అబద్దయ్య

రోడ్డు బాగుచేయించరూ..

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల నుంచి ఈమని వెళ్లే రహదారి అత్యంత దయనీయంగా ఉందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సాయిచైతన్య, తెదేపా నాయకులు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం కంఠంరాజుకొండూరు వచ్చిన లోకేశ్‌తో వారు ఈ విషయంపై మాట్లాడారు. వెంటనే చర్య తీసుకుంటానని మంత్రి చెప్పారు.

మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్ నేడు

తాడేపల్లి: మంగళగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉదయం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారని పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదలైంది. ఉదయం 6నుంచి 7 గంటల మధ్య ప్రజలు తమ సమస్యలపై నేరుగా మంత్రికి వినతులు సమర్పించవచ్చని.. ఆ గంటలోపు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు.

పుష్కరిణి తొలి విడత పునరుద్ధరణ పనులు పూర్తి

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి కల్యాణ పుష్కరిణి(పెదకోనేరు) పునరుద్ధరణ పనులు తొలి దశ పూర్తయ్యాయి. మంత్రి నారా లోకేశ్ చొరవతో కోనేటి పనులు కొలిక్కివచ్చాయి. దీంతో నీటిని బయటకుతోడే పనులు ఆలయ అధికారులు నిలిపివేశారు. ఫలితంగా ఊట నీరు చేరి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. 2022 డిసెంబరులో ఈ పనులను ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నత్తనడకన సాగాయి. ఫలితంగా కోనేటి చుట్టూ ఉన్న [illegible]లో భూగర్భజలాలు అడుగంటాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పనులు వేగవంతం చేసి ప్రస్తుతం తొలిదశ పూర్తి చేశారు. బేస్‌మెంట్‌లో మెట్ల నిర్మాణం పూర్తిచేశారు. సుమారు 96 సెంట్ల విస్తీర్ణంలో 1558లో కోనేటిని తవ్వించారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు కోనేటి పునరుద్ధరణ కోసం రూ.1.50 కోట్ల నిధులు ఖర్చు చేశారు. రెండోదశలో పనులు త్వరలోనే చేపట్టనున్నారు.



కోనేటిలో పెరిగిన నీటి ఊట

ఈ రోడ్డు గతి ఇంతేనా?



గొట్టిపాడు నుంచి పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం వెళ్లే రోడ్డు దారుణంగా ఉంది. 6 ఏళ్ల కాలం నుంచి భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. రెండు మండలాల మధ్య కీలకమైన రోడ్డు ఇది. పెదనందిపాడు మండలం రావిపాడు, జీజీ పాలెం, గోగులమూడి, ప్రత్తిపాడు మండలం వంగిపురం, మేదరిపాలెం, కాకుమాను మండలం వల్లూరు పరిసర గ్రామాల ప్రజలు చిలకలూరిపేట వెళ్లేందుకు కీలకమైన రోడ్డు ఇది. అధికారులు చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

తూములపై రాకపోకలు ఎలా?

ప్రత్తిపాడులో ఎస్సీకాలనీ నుంచి ఎస్సీ ఏరియా, గొట్టిపాడు రోడ్డుకు వెళ్లేందుకు విద్యార్థులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి మధ్యలో నక్కవాగు ఉంది. వరదొస్తే ఈ వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. దీంతో స్థానికులే తూములు ఏర్పాటు చేసుకుని గ్రావెల్, డస్టు పోయించుకున్నారు. గతేడాది వాగులో నీరు ప్రవహించడంతో గ్రావెల్, డస్టు కొట్టుకుపోయింది. వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి స్థానికులు కోరుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

బెంబేలెత్తించిన వాన, గాలి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఒక్కసారిగా మారిన వాతావరణం ఆదివారం ఉదయం రైతులను బెంబేలెత్తించింది. పలుచోట్ల మొక్కజొన్న గింజలు పొలాల్లో ఉండటంతో అన్నదాతలు చేల వైపు ఉరుకులు, పరుగులు తీశారు. పట్టాలు కప్పారు. మరో రెండు రోజులు వానలు పడొచ్చని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో చేలల్లోని కండెలను వాహనాల్లో బయటకు తరలించారు. పలుకాలనీలు, వీధులు జలమయమయ్యాయి. మధ్యాహ్నం నుంచి ఎండ రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



వర్షానికి కారణంగా తమ చేలోని కండెల్ని ట్రక్కు ఆటోలో బయటకు తెచ్చేస్తున్న రైతు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని రాజధాని గ్రామాల్లో ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కారుమబ్బులతో గంటపాటు వర్షం పడింది. రహదారుల వెంకట వరద నీరుపారింది. దీంతో మధ్యాహ్నం వరకు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కొమ్మూరులో వైభవంగా మల్లెలపూజ



పూజ చేస్తున్న మహిళలు

కొమ్మూరు(కాకుమాను) : మండలంలోని కొమ్మూరులో అంకమ్మ, పోలేరమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా ఆదివారం వైభవంగా మల్లెలపూజ జరిగింది. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సోమవారం సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ, మంగళవారం తిరునాళ్ల మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విగ్రహాల ఊరేగింపు

దుగ్గిరాల: స్థానిక యాదవపాలెంలో నూతనంగా నిర్మించి రామాలయంలో ఈనెల 8న ప్రతిష్ఠించనున్న విగ్రహాలను ఆదివారం గ్రామంలోని ప్రదర్శనగా తీసుకువచ్చారు. ఆదివారం నుంచి పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి.

భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని 113 తాళ్లూరులో ఆదివారం మహంకాళి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలేరమ్మ, అద్దంకమ్మల తిరునాళ్ల..

వింజనంపాడు (వట్టిచెరుకూరు) : వింజనంపాడు గ్రామంలో శ్రీపోలేరమ్మ, అద్దంకమ్మల తిరునాళ్ల ఆదివారం రాత్రి పావనం ప్రదర్శనతో ప్రారంభం అయింది. అమ్మవార్లకు భక్తులు పూజలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి దేవాలయం వద్ద నీరు వారుపోసి, సంప్రదాయంగా పూజలు చేస్తూ హారతులు పట్టారు.



వింజనంపాడులో పూజలు

వైభవంగా రాములోరి కల్యాణం..

పల్లపాడు(వట్టిచెరుకూరు) : మండలంలోని పల్లపాడు గ్రామంలో శ్రీకోదండ రామస్వామి ఆలయం వద్ద స్వామివారి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

6 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నాగులపాడు(పెదనందిపాడు): ప్రసిద్ధ శృంగేరి శారద పీఠ పాలిత నాగులపాడు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు, అశేష సప్తాహం, కల్యాణమహోత్సవాలు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని పాలక మండలి ఆధ్వర్యంలో శోభాయమానంగా అలంకరించారు. 49 శిరస్సుల పంచలోహ విగ్రహం దానిపై స్వామి పాలరాతి విగ్రహం ఉండడం ఇక్కడి ప్రత్యేకత. 6న గోపూజ, సర్వతో భద్రమండల ఆరాధన, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు.



స్వామివారు

అమరవీరుల స్మారక సభ నేడు

పాలపర్రు(పెదనందిపాడు) న్యూస్‌టుడే: పాలపర్రులో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9గంటలకు ప్రజా ప్రదర్శన, అమరవీరుల స్మారక సభ పాపలర్రు గ్రామ శాఖ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో జరగనున్నట్లు సీపీఎం మండలకార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి. రామారావు, ఇతర నాయకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే; వట్టిచెరుకూరులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణం సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. గ్రామంలోని ప్రధాన కూడలిలో కోలాటం వీక్షించేందుకు గ్రామస్థులు బారులు తీరారు.

బాధిత కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా



బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న తెదేపా నాయకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని ఉండవల్లిలో ఆదివారం ఉదయం గాలివానకు డీకొల్లు చైతన్య ఇంటి పైకప్పు దెబ్బతింది. మంత్రి లోకేశ్ స్పందించి బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆదివారం స్థానిక తెదేపా నాయకులు చైతన్యకు అందించారు. తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతిబసు, నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాయపూడి కిరణ్, వల్లభాపురం శంకర్, బసివిరెడ్డి, దాసరి కృష్ణ, తోటా సాంబశివరావు, లీలా కృష్ణ పాల్గొన్నారు.

కులగణనపై హర్షం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం కాజ గ్రామంలో భాజపా నాయకులు ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేపట్టేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కరాటేతో ఆత్మరక్షణ

మంగళగిరి : ఆత్మరక్షణ కోసం కరాటే తప్పనిసరని సీఐడీ ఎస్పీ కడియం చక్రవర్తి అన్నారు. మంగళగిరిలోని మార్షల్ ఆర్ట్స్ అండ్ కరాటే కోచింగ్ సెంటర్‌లో ఆదివారం కరాటే బెల్టు టెస్ట్ నిర్వహించారు. దాదాపు వంద మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. సీనియర్ మాస్టర్ జీవి నరసయ్య, గంజి కులశేఖర్, జపాన్ సుటోరియో ఏపీ జనరల్ సెక్రటరీ ప్రభాకర్ పాల్గొన్నారు.

బాలిక అపహరణ కేసులో నిందితుల అరెస్ట్

మేడికొండూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అపహరించిన కేసులో యువకుడితోపాటు అతడికి సహకరించిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాలికను ఆదే గ్రామానికి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి.. కొద్ది రోజుల కిందట అపహరించుకుని వెళ్లాడు. మూడు రోజుల తర్వాత ఇంటికి వచ్చిన బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యువకుడితోపాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వారిలో ముగ్గుర్ని అదుపులోకి తీసుకోగా.. మరో యువకుడు పరారీలో ఉన్నాడు. నిందితులను శనివారం గుంటూరు ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని పోలీసులు తెలిపారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకురాలు బి.అరుణ చెప్పారు. ప్రత్తిపాడులోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులతో కథలు చదివించారు. క్యారమ్స్, చెస్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు.



ప్రత్తిపాడు: చిత్రలేఖనం పోటీలో గీసిన బొమ్మలను చూపిస్తున్న విద్యార్థులు



సందేశాన్ని ఇస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాల

క్రీస్తు మార్గం అనుసరణీయం

పెదనందిపాడు : క్రీస్తు మార్గం అనుసరణీయమని విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాల అన్నారు. అబ్బినేనిగుంటపాలెం వేళాంగిణిమాత ఆలయంలో జరుగుతున్న తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా 2వ రోజు ఆదివారం ఆలయంలో దివ్యపూజాబలి, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వాసులనుద్దేశించి ఆయన సందేశమిచ్చారు. పీఠాధిపతులు భాగ్యయ్య (గుంటూరు), ఆంతోనిదాస్(నెల్లూరు), విశ్రాంత పీఠాధిపతి గాలిబాలి (కడప), ఆలయ విచారణగురువు బల్తజార్ రాజు పాల్గొన్నారు.

అడ్డు తొలగించరూ..



వరగాని సమీపంలో మేకలవాగులో అడ్డుగా ఉన్న కట్టను తొలగించాలని కొందరు రైతులు జలవనరుల శాఖ అధికారులను కోరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరదనీరు సజావుగా వెళ్లేందుకు ఆటంకం కలుగుతుందని కర్షకులు చెబుతున్నారు. వేసవిలోనే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పెదనందిపాడు**

క్రికెట్‌లో సత్తా



బహుమతి ప్రదానం

మేడికొండూరు, న్యూస్‌టుడే: గుండ్లపాలెంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మంగళగిరికి చెందిన డీడీఆర్ సూపర్ కింగ్స్ జట్టు విజేతగా నిలవగా.. రన్నర్‌గా గ్రామానికి చెందిన అంబేడ్కర్ సీసీ జట్టు నిలిచింది. ఒకటి, రెండు బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.15 వేలు అందించారు. తెదేపా నాయకులు గుత్తా చంద్రశేఖర్, కనుమూరి నరసింహరావు, పాములపాటి రామాంజనేయులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు

ప్రజాఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉంటుందని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863-2224202 డయల్ యువర్ కమిషనర్ ఉంటుందన్నారు. అనంతరం కౌన్సిల్‌హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీల స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.



ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాటా 16, వంగ 14, బెండ 26, పచ్చిమిర్చి 29, కాకర 32, క్యారెట్ 26, క్యాబేజీ 16, బీర 24, దొండ 18, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 20, గోరుచిక్కుళ్లు 31, దోస 18, పొట్ల 19, పెద్ద చిక్కుళ్లు 50, చామదుంప 42, మునగ 5, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 20, బీట్‌రూట్ 23, కీర 25, క్యాప్సికం 65, అల్లం 50, ఫ్రెంచి బీన్స్ 65, సొర 10, అరటి 7.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

❖ అరుంధతినగర్ రెండోలైన్ కాల్వల్లో పూడికలుచేరి మురుగునీరు పారడం లేదని అందిన ఫిర్యాదు మేరకు శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ స్పందించారు. కాల్వల్లో పూడికలు తీయించారు.

❖ చేనేతకాలనీ ప్రధాన రోడ్డులో సైడుకాల్వల్లో పూడికలు చేరి ఇళ్లలో మురుగునీరు పారడంలేదని అందిన ఫిర్యాదు మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు.

❖ మంగళదాస్‌నగర్ రెండోలైన్‌లో చెత్తకుప్పలు తీయకపోవడంతో వీధి అపరిశుభ్రంగా మారిందని అందిన ఫిర్యాదు మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. చెత్త కుప్పలు తీయించారు.

❖ వాసవీనగర్ ప్రధాన రోడ్డులో మలుపుల వద్ద చెత్తకుప్పలతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఫిర్యాదు మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. చెత్తకుప్పలు తీయించి తరలించారు. **- న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)**

రాళ్లకుప్పల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సీతానగర్ నుంచి పరమయ్యకుంటకు వెళ్లే మార్గంలో రాళ్లకుప్పలను రోడ్డుకు అడ్డంగా పోయడంపై 'ఈనాడు'లో ఈ నెల 2వ తేదీన 'సీతానగర్‌లో సమస్యల తిష్ఠ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సిబ్బందిని పంపించి రాళ్లకుప్పలను తీయించారు. దీని పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు కావలెను..!

పనిభారంతో సతమతమవుతన్న సిబ్బంది



తూర్పు ట్రాఫిక్ పోలీసుస్టేషన్

పట్నంబజారు, న్యూస్‌టుడే: పెరిగిన జనాభాకు అనుగుణంగా తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సిబ్బందిని పెంచేందుకు పోలీసు ఉన్నతాధికారులు మెతకవైఖరి ప్రదర్శిస్తున్నారు. దాదాపు మూడు లక్షల జనాభా ఉన్న తూర్పు విభాగపు పరిధిలో వేళ్ల మీద లెక్కించే సంఖ్యలో ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తించే కొందరు హెడ్ కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ పోలీసులను అటాచ్‌మెంట్‌పై ఇతర ప్రాంతాలకు పంపుతుండడంతో మిగిలిన సిబ్బందికి పనిభారం తలకు మించిన భారంగా మారుతోంది.

✪ బస్టాండు సెంటర్‌లోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ఆరుగురు ఏఎస్‌ఐలు, 13 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 18 మంది కానిస్టేబుళ్లు, 11 మంది హోంగార్డులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న ఐదుగురు ఏఎస్‌ఐలలో ఒకరిని డీఎస్పీ కార్యాలయానికి అటాచ్‌మెంట్ చేశారు. దీంతో నలుగురు మాత్రమే ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. 13 మంది హెడ్ కానిస్టేబుళ్లలో డీఎస్పీ కార్యాలయానికి ఒకరు, ఎస్పీ కార్యాలయానికి ఒకరు, సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు ఒకరిని చొప్పున అటాచ్‌మెంట్‌పై పంపుతున్నారు. దీంతో 10 మంది మాత్రమే ఇక్కడ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 18 మంది కానిస్టేబుళ్లలో తాడేపల్లికి ఇద్దరిని, ఎస్‌టీఎఫ్‌కు ఇద్దరిని, డీఎస్పీ కార్యాలయానికి ఇద్దరిని అటాచ్‌మెంట్ ఇవ్వడంతో. . మిగిలిన 12 మందితో నెట్టుకొస్తున్నారు.

తలకు మించిన భారంగా..

ప్రముఖులు నగరంలోకి వచ్చిన సందర్భాల్లో వీరిలో కొందరు బందోబస్తుకు వెళ్లడంతో నగరంలోని ట్రాఫిక్ పాయింట్ల వద్ద విధులు నిర్వర్తించే వారు కరవయ్యారు. పట్నంబజారు, హిమనిసెంటర్, మార్కెట్ సెంటర్, బస్టాండు సెంటర్, ఆసుపత్రి రోడ్డు ప్రాంతాల్లో ఉన్న కొద్దిపాటి ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఓ వైపు ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తూనే మరో వైపు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేయడం పనిభారంగా మారుతోంది. కొద్ది రోజుల్లో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభం కానున్నాయి. నిర్మాణ పనులు కొనసాగుతున్న అన్ని రోజులు ట్రాఫిక్‌ను ఇతర ప్రాంతాల వైపుగా మళ్లిస్తారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ పోలీసులను పెంచేందుకు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పేదలకు ఇప్పటి వరకూ ఇంటి స్థలాలు ఇవ్వకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 2వ తేదీన ప్రధాని మోదీ సభ వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పేర్కొన్నారు. నగర కార్యదర్శి మాల్యాద్రి మాట్లాడుతూ.. శంకర్‌విలాస్ బ్రిడ్జికి గతంలో రూ.162 కోట్లు అంచనా వేసి ఇప్పుడు రూ.98 కోట్లతో బడ్జెట్ కుదించి నిర్మిస్తామని చెప్పడాన్ని ప్రజాసంఘాలు, సీపీఐ వ్యతిరేకిస్తున్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించాలనుకోవడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు రంగారెడ్డి, చైతన్య, జగన్నాథం, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్, ప్రతినిధులు

మోదీ మాటలు వైకాపా నాయకులకు మింగుడుపడడం లేదు

తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు

నగరపాలకసంస్థ: అమరావతి పునర్నిర్మాణ సభలో ప్రధాని చెప్పిన మాటలు వైకాపా నాయకులకు మింగుడుపడడం లేదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె. శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నా.. ప్రాజెక్టులు వేగంగా అభివృద్ధి చెందాలన్నా.. నాణ్యతతో పూర్తి చేయాలన్నా దేశంలో చంద్రబాబుకు తప్ప మరెవరికీ సాధ్యంకాదని స్వయంగా ప్రధాని మోదీ చెప్పిన విషయం గుర్తుచేశారు. క్విడ్‌ప్రోకో, మద్యం కుంభకోణం తదితర కేసుల్లో జగన్ శాశ్వతంగా జైలులోనే మగ్గక తప్పదని విమర్శించారు. జగన్‌తోపాటు ఆయన మంత్రి వర్గంలో చేసిన వారంతా వారు చేసిన నేరాలు, ఘోరాలకు జైలుపాలు కాక తప్పదని హెచ్చరించారు

యోగాతో మానసిక ఆరోగ్యం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా అవసరమని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నగరంలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్వామి వివేకానంద యోగ కేంద్ర రజతోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, తులసి గ్రూపు సంస్థల అధినేత రామచంద్రప్రభు, నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, సిద్ధపీఠం అధిపతి స్వాత్మానందయోగి పాల్గొన్నారు. యోగ గురు ఆళ్ల రాజేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్న సదుద్దేశంతో యోగ సంస్థను స్థాపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శిష్యుల సాధనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ గురువులు 40 మందిని నిర్వాహకులు సన్మానించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని.. వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం కోరారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో రైతుసంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ. . ప్రభుత్వం నుంచి కౌలురైతులకు ఎలాంటి సహాయ, సహకారాలు అందడంలేదని వాపోయారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6వ తేదీన కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో ఏర్పాటు చేస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంలో కౌలు రైతులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్నాథం, విఠల్‌రెడ్డి, రంగారెడ్డి

మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటిన్నియల్ ఆధ్వర్యంలో ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని మౌర్య ఫంక్షన్ హాల్‌లో ఐదుగురు దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేశారు. మౌర్య సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ కోవెలమూడి రవీంద్ర, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్, సరిపూడి అనిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్ల అందజేత కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, తదితరులు

పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ, ముస్లిం యూత్ ఆధ్వర్యంలో పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్నా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. ఖత్నా నిర్వహించి వారికి మందులు, పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు పేదలను ఆదుకునేందుకు సేవాసంస్థలు ముందుకు రావాలని పేర్కొన్నారు. ఆరిఫ్, రౌఫ్, సలీం, రెహమాన్, షౌకత్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పట్నంబజారు, న్యూస్‌టుడే: పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఇస్లామియా హైస్కూల్‌లో ముస్లిం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 350 మంది పేద బాలురకు ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సలీం, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రౌఫ్, ఎండీ. ఆరిఫ్, ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు



నగరపాలకసంస్థ: పౌష్టికాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

బాధిత కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని ఉండవల్లిలో ఆదివారం ఉదయం గాలివానకు డీకొల్లు చైతన్య ఇంటి పైకప్పు దెబ్బతింది. మంత్రి లోకేశ్ స్పందించి బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆదివారం స్థానిక తెదేపా నాయకులు చైతన్యకు అందించారు. తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి తోడ్పాటు

నవభారత్‌నగర్: కళాశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటామని జేసీ న్యాయ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గం పేర్కొంది. కళాశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు బీవీఎస్ సుబ్రహ్మణ్య ప్రసాద్, కార్యదర్శి పి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం సహకారంతో ఉచిత న్యాయ సలహా సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

భగీరథ మహర్షి జయంతి సభ



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: భగీరథ మహర్షి జయంతి సభ కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి.. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, పలు సంఘాల నాయకులు మద్దిరాల గంగాధర్, శైలజ, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి కె. మయూరి పలువురు అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పట్టాభిపురం: రౌడీషీటర్లు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టాభిపురం ఠాణా పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నివాసం ఉండే ప్రాంతాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఆహ్లాదాన్ని పంచేదెప్పుడో..!

- అభివృద్ధికి దూరంగా మానససరోవరం పార్కు
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థకు చెందిన మానససరోవరం పార్కు ఒకప్పుడు ఆహ్లాదకర వాతావరణానికి చిరునామాగా ఉండేది. ప్రస్తుతం పార్కు నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేయడంతో అధ్వానంగా మారింది. గత వైకాపా పాలనలో కనీసం పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ దుస్థితి నెలకొంది.



శిథిలమైన పైలాన్



బోట్ షికారు కాల్వల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

గతంలో ప్రతిపాదనలు పంపినా..

జాతీయ రహదారి పక్కనే 53 ఎకరాల్లో మానససరోవరం పార్కు ఉంది. నాడు నిత్యం ఐదు వేలకుపైగా సందర్శకులు గుంటూరుతోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి వచ్చేవారు. ప్రస్తుతం కళావిహీనంగా.. శిథిలావస్థలోకి చేరడంతో మూసివేశారు. పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని గతంలో పనిచేసిన ఇద్దరు కమిషనర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ మానససరోవరం పార్కుపై నాయకులు, అధికారులు దృష్టి పెడతారని అందరూ భావించారు. అత్యాధునికంగా, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే పీపీపీ విధానంలోనే సాధ్యమని పార్కును అలాగే శిథిలావస్థలో ఉంచుతున్నారు.

వినియోగంలోకి తెస్తేనే..

అమలుకు నోచుకోని ప్రణాళికలు పట్టుకుని వేలాడకుండా.. పిచ్చిమొక్కలు, జంగిల్ తొలగించి, రహదారులు, కాటేజీల మరమ్మతులు చేసి, అల్పాహార స్టాల్స్, హోటల్స్‌ను ఏర్పాటు చేసి, సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా పునరుద్ధరిస్తే జీఎంసీకి ఆదాయం పెరుగుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. అత్యాధునికంగా, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే భారీగా ఖర్చవుతోంది. వినియోగంలోకి వచ్చాక చేయడం మరింత సులువవుతుంది. పార్కును వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు.. వర్షాలు పడినప్పుడు నీరు నిలవకుండా డ్రెయిన్ల ఏర్పాటు, లోతట్టుగా ఉన్నచోట మట్టి తోలించి చదును చేయించాలి. గతంలో మాదిరి పిల్లల ఆటపరికరాలతో పాటు, కంప్యూటర్ గేమింగ్ సెంటర్లు, కుటుంబ సమేతంగా వచ్చేవారికి ఆహ్లాదం పంచే విధంగా పచ్చదనం, ఇతర వసతులు అభివృద్ధి చేయాల్సి ఉంది. పార్కు అభివృద్ధికి తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినందున.. దీనికి సంబంధించి అధికారులు కూడా వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

బస్సుషెల్టర్ నిర్మించరూ..



రోడ్డుపైనే ప్రయాణికులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రయాణికులకు నీడ కల్పించడంలో ఆర్టీసీ అధికారులు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారు. హిందూ కాలేజీ వెనుక రోడ్డులోని పల్నాడు బస్టాండు సెంటర్‌లోని బస్సు షెల్టర్‌ను చూస్తే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. చాలీచాలని బస్సు షెల్టర్‌లో కొందరు ప్రయాణికులు బస్సుల రాకకోసం రోడ్డుపై పడిగాపులు గాస్తున్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు తెలిపిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నరసరావుపేట, చిలకలూరిపేట, ఏటుకూరు, కోండ్రుపాడు, పత్తిపాడు, పొత్తూరు, మాచర్ల తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడ బస్సుల రాకకోసం వేచి చూస్తుంటారు. ఉన్న ఒక్క బస్సు షెల్టర్‌లో తలదాచుకోలేక కొందరు ప్రయాణికులు సమీపంలో ఉన్న దుకాణాల ముందు ఉన్న నీడలో నిల్చుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ ప్రాంతంలో మరో బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం...



హిందూ కాలేజీ వెనుక రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: హిందూ కాలేజీ వెనుక రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వ్యాపార సముదాయాలకు కేంద్రబిందువుగా మారిన ఈ ప్రాంతంలో వారం రోజుల నుంచి పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలను తొలగించడం లేదు. వీటి నుంచి వచ్చే దుర్వాసనతో ముక్కులు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. పేరుకుపోయిన వ్యర్థాల వల్ల అన్న క్యాంటీన్‌కు వచ్చే వారి సంఖ్య తగ్గుతుంది. మరోవైపు ఇక్కడ సమీపంలో ఉన్న ఆటోస్టాండుకు ప్రయాణికులు రావడం లేదని ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు వివరించిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సుధాకర్ అనే ఆటో డ్రైవర్ పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడి వ్యర్థాలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కనులపండువగా మహా రుద్రాభిషేకం



స్వామివారికి కుంకుమాభిషేకం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నెహ్రూనగర్ 6వ వీధిలో ఆదివారం రాత్రి మహా రుద్రాభిషేకం కనులపండువగా నిర్వహించారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు స్వామీజీ శిష్య బృందం శివలింగానికి గంధం, కుంకుమ పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. అభిషేకాల అనంతరం నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

6 నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సీతారామనగర్ 1వ వీధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు నీలం శంకర్‌రావు, పాలేటి సుబ్బారెడ్డి, తోటకూర బుచ్చిబాబు, గట్టి శ్రీను ఆదివారం తెలిపారు. 6వ తేదీ మంగళవారం స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. 7వ తేదీ స్వామివారి సజీవ సమాధి అయిన సందర్భంగా అభిషేకాలు, కుంకుమార్చన, ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

నవ్వుతోనే ఆరోగ్యం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: నవ్వుతోనే ఆనందాన్ని, ప్రశాంతతను సాధించొచ్చని, ఫలితంగా చక్కటి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయని డాక్టర్ వి.వి.రామకుమార్ తెలిపారు. ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో రామకుమార్ మాట్లాడారు. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ఎన్నెన్నో జీవనశైలి సమస్యలకు మానసిక ప్రశాంతత కొరవడడమే కారణమన్నారు. నవ్వు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఎన్నో ప్రయోజనాలను అందించే నవ్వు ప్రాధాన్యం అందరూ తెలుసుకోవాలన్నారు. అప్రయత్నంగానో, ఉద్దేశపూర్వకంగానో.. ఎలాగైనా సరే నవ్విన వారికి నవ్వినంత మేలు చేకూరుతుందన్నారు. నవ్వు తెప్పించే పుస్తకాలు, జోకులు, కార్టూన్లు, వీడియోలు అందుబాటులో ఉన్నాయన్నారు. నవ్వు ప్రాధాన్యం, ఒనగూరే ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రాజధాని అమరావతికి తిరుగులేదు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి ఇక తిరుగు లేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అమరావతి పునర్నిర్మాణ సభకు భారీగా తరలివచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యలతో స్పష్టమైంది. కనీవినీ ఎరుగని రీతిలో అమరావతి సభ విజయవంతం కావడంతో వైకాపా నేతలకు వెన్నులో వణుకు పుట్టి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. జగన్ మెప్పు పొందేందుకు అంబటి రాంబాబు పాకులాడుతున్నారు. వైకాపా ఎన్ని కుట్రలు చేసినా అమరావతిలో ఒక్క ఇటుక రాయిని కూడా కదిలించలేదు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే వారి ఇళ్లు, కార్యాలయాలను ప్రజలే ముట్టడిస్తారు'.. అని హెచ్చరించారు.

ఆకట్టుకున్న నృత్య పోటీలు

గుంటూరు సాంస్కృతికం: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రాధామాధవ నాట్యక్షేత్రం ఆధ్వర్యంలో నాట్య గురువులకు నాట్య సారథి పురస్కారాలు, శిష్యులకు ఆదివారం రాత్రి నృత్యంలో పోటీలు నిర్వహించారు. పలువురు చిన్నారులు బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమాలను నాట్యాచార్య షేక్ ఖలీల్ నిర్వహించారు.



విజేతలతో నిర్వాహకుడు ఖలీల్

తాగునీరు వృథా

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలోని అనేక ప్రాంతాలకు తాగునీరు లభించక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే నెహ్రూనగర్ రహదారులపై మంచినీరు వృథాగా పోతోంది. ఆదివారం సాయంత్రం నెహ్రూనగర్ రిజర్వాయర్‌లో శుద్ధిచేసిన తాగునీరు ట్యాంకులకు పంపింగ్ చేస్తున్న క్రమంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో అధిక మొత్తంలో మంచినీరు మురుగు కాలువల ద్వారా ప్రవహించి రహదారులపై పొంగిపొర్లింది. మురుగునీటిపై రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బందులుపడ్డారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



యూత్ హాస్టల్స్ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

రాజేంద్రనగర్: యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గుంటూరులోని టీజేపీఎస్ కళాశాలలో పరిశీలకుడు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా టి.చంద్రశేఖర్, ఛైర్మన్‌గా డాక్టర్ కె.కొండయ్య, కార్యదర్శిగా కె.రవికిరణ్, కోశాధికారిగా కె.సుధాకర్, ఉపాధ్యక్షులుగా కేశవ గురూజీ, జానకి, సంయుక్త కార్యదర్శులుగా కొండపు నాయుడు, శ్రీలత, నిర్వహణ కార్యదర్శిగా భానురావు, మీడియా సమన్వయకర్తలుగా గురుప్రసాద్, సునీల్ ఎన్నికయ్యారు. 2025-28 సంవత్సరాలకు కొత్త కార్యవర్గం ట్రెక్కింగ్, తదితర సాహస కార్యక్రమాలు నిర్వహిస్తారని నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

చౌకబియ్యం పట్టివేత

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని ఆదివారం రాత్రి నగరంపాలెం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మల్లారెడ్డినగర్‌లో ఓ వ్యక్తి గది అద్దెకు తీసుకొని చౌకబియ్యాన్ని నిల్వచేసి అక్రమంగా తరలిస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. నగరంపాలెం పోలీసులతో కలిసి ఆదివారం రాత్రి చౌక బియ్యం అక్రమ రవాణా చేస్తున్న క్రమంలో ఆకస్మిక దాడులు చేసి పట్టుకున్నారు. 170 బస్తాల వరకు చౌక బియ్యాన్ని పోలీసులు జప్తుచేసినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్లు లేక ఇబ్బందులు

అధికారుల నిర్లక్ష్యం ఆ ప్రాంతవాసులకు శాపంగా మారింది. కొత్తపేట భాస్కర్ డీలక్స్ ఎదురు రోడ్డులో ఇటీవల సైడు కాలువలు నిర్మించారు. అనంతరం దుకాణాల ఎదుట మెట్లను నిర్మించడం మరిచారు. వస్త్ర దుకాణాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో షాపుల ఎదుట మెట్లు లేకపోవడంతో వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మెట్లు లేకపోవడంతో దుకాణాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య తగ్గి వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్తగా నిర్మించిన సైడు కాలువలపై మెట్లను నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పట్నంబజారు



గుంటూరు పశ్చిమ

రాజధాని అమరావతికి తిరుగులేదు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి ఇక తిరుగు లేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి వివరించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అమరావతి పునర్నిర్మాణ సభకు భారీగా తరలివచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యలతో స్పష్టమైంది. కనీవిని ఎరుగని రీతిలో అమరావతి సభ విజయవంతం కావడంతో వైకాపా నేతలకు చెవుల్లో వణుకు పుట్టి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. జగన్ మెప్పు పొందేందుకు అంబటి రాంబాబు పాకులాడుతున్నారు. వైకాపా ఎన్ని కుట్రలు చేసినా అమరావతిలో ఒక్క ఇటుక రాయిని కూడా కదిలించలేరు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే వారి ఇళ్లు, కార్యాలయాలను ప్రజలే ముట్టడిస్తారు'. అని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాల్వల్లో పూడికతీత: నగరపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వద్ద కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీటి పారుదలకు ఆటంకం ఏర్పడింది. దీనివల్ల దోమల బెడద ఎక్కువైంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో కాల్వల్లో పూడిక తీయించారు.

మురుగు నీటి పారుదల సాఫీగా..: పోలీస్ పరేడ్ గ్రౌండ్ దగ్గర సైడ్ కాల్వల్లో చెత్త పేరుకుపోయి మురుగు నీటి పారుదల లేక దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటేషన్ సూపర్‌వైజర్ అంగడి రాజేష్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి కాల్వల్లో చెత్త, వ్యర్థాలు తొలగింపజేసి నీటి పారుదల సక్రమంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

ప్రజాఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863-2224202 డయల్ యువర్ కమిషనర్ ఉంటుందన్నారు. అనంతరం కౌన్సిల్‌హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీల స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ధర వరలు



కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 16, వంగ 20, బెండ 24, పచ్చిమిర్చి 28, కాకర 39, బీర 44, క్యాబేజి 16, క్యారెట్ 26, దొండ 17, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 27, గోరుచిక్కుళ్లు 29, దోస 18, సొర 17, పొట్లకాయ 19, అరటికాయ 7, చామదుంప 44, బీట్‌రూట్ 30, కీరదోసకాయ 34, బీన్స్ 64, క్యాప్సికమ్ 55, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 60, అల్లం 50, వెల్లుల్లి 110, చిలకడదుంప 36. -న్యూస్‌టుడే, పట్టాభిపురం

డ్రెయిన్లు అస్తవ్యస్తం.. అవస్థలు నిత్యకృత్యం

మురుగు నీరు ముందుకెళ్లక రాకపోకలకు ఇబ్బందులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పలు కాలనీల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా నగరపాలక సంస్థ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చకపోవడంతో ఆయా కాలనీల్లో రోడ్లను సైతం మురుగు ముంచెత్తుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. సైడు కాల్వలు నిర్మించకపోవడంతో స్థానికులు ఎవరికి వారు ఇష్టమొచ్చినట్లు కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇవి ఒకే స్థాయిలో లేకపోవడం, మరీ చిన్నవిగా ఉండడంతో మురుగునీరు ముందుకెళ్లడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది కాల్వల్లో పూడిక సైతం తీయడం లేదని, పిచ్చి మొక్కలు కాల్వలపై పెరిగి అల్లుకున్నా పీకి శుభ్రం చేయకుండా వదిలేయడంతో తాము పడరాని పాట్లు పడుతున్నామని కృష్ణనగర్ వాసులు వాపోతున్నారు. విద్యానగర్, చంద్రమౌళినగర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.


కృష్ణనగర్ కాల్వపై బడ్డీ కొట్టు.. గుంతలో నిలిచిన మురుగునీరు..


కాల్వలో పూడిక తీయరు... పిచ్చి మొక్కల్ని తొలగించరు..

కాల్వలు నిర్మించకుండా రోడ్లు వేస్తే ఎలా..

కృష్ణనగర్ ప్రాంతంలో అధికశాతం కాల్వలు ఏర్పాటు చేయకుండా రోడ్లు నిర్మించేశారు. రహదారులు అభివృద్ధి చేయబోయే ముందు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చి ఉంటే ఇప్పుడీ పరిస్థితి దాపురించేది కాదు. రోడ్లు నిర్మించి సైడు కాల్వలు నిర్మించకపోవడంతో స్థానికులు ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించే సమయంలో ఎవరికి వారు కాల్వలతో పాటు ర్యాంపులు ఏర్పాటు చేసుకున్నారు. పెరుగుతున్న నివాసాల మేరకు కాల్వల సామర్థ్యం లేదు. కాల్వలు నిర్మించకుండా రోడ్డు అభివృద్ధి చేయడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది పూడిక తొలగించక పోవడంతో ఎక్కడి మురుగునీరు అక్కడే కాల్వల్లో నిలిచిపోయి దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రెండో లైను నుంచి ఆరో లైను వరకు ఇదే పరిస్థితి నెలకొందని ఆ ప్రాంతవాసులు గోడు వెళ్లబోసుకున్నారు. సైడు కాల్వల సామర్థ్యం పెంచి మెరుగుపర్చాలని స్థానికులు పలుమార్లు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యం. కృష్ణనగర్ కుడుల రోడ్డు పార్కు వద్ద ఓ వైపు కాల్వపై బడ్డీ కొట్టు పెట్టినా పట్టించుకోవడం లేదు. ఇక్కడ రెండు వైపులా గుంతలు పెట్టి మురుగునీరు నిల్వ ఉంచుతున్నారు. దీంతో రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. విద్యానగర్, చంద్రమౌళినగర్‌లోనూ ఏళ్లుగా డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చడంలేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుత్తు సరఫరాకు రెండు రోజులు అంతరాయం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-3 సబ్ డివిజన్ పరిధిలో లైన్ల మరమ్మతుల వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ రాజమోహనరావు తెలిపారు. దీని వల్ల సోమ, మంగళవారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంపత్ నగర్, ఆర్.అగ్రహారం, ఎత్తురోడ్డు, మస్తాన్‌దర్గా రోడ్డు, రమేష్ ఆసుపత్రి, మార్కెట్ ఏరియా, పట్నంబజారు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని.. వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం కోరారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో రైతుసంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి కౌలురైతులకు ఎలాంటి సహాయ, సహకారాలు అందడంలేదని వాపోయారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6వ తేదీన కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో ఏర్పాటు చేస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంలో కౌలు రైతులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పాల్గొన్నారు.

భగీరథుడిని స్మరించుకోవడం అందరి బాధ్యత


మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: భగీరథ మహర్షి జయంతి సభ కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి.. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగీరథుడిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, పలు సంఘాల నాయకులు మద్దిరాల గంగాధర్, శైలజ, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి కె.మయూరి పలువురు అధికారులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

గోరంట్ల సెయింట్ ఆన్స్ మహిళ కళాశాల ఎంబీఏ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 2008-2010 కళాశాల ఎంబీఏ ద్వితీయ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య, ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎల్.నరసింహారావు, ఎంబీఏ విభాగాధిపతి జి.రాధిక, పూర్వ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కలెక్టరేట్



మనసారా నవ్వితే ఆరోగ్యం సొంతం


సభ్యులతో కలిసి వ్యాయామం చేస్తున్న లాల్‌వజీర్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మనసారా నవ్వితే ఆరోగ్యం సొంతమవుతుందని లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా రకరకాల వ్యాయామాలు చేశారు. లాల్‌వజీర్ మాట్లాడుతూ నవ్వడం వల్ల అంతర్గత ఆనందం వస్తుందని సైన్స్ ప్రకారం రుజువైందన్నారు. రక్తపోటు, మధుమేహం, మానసిక ఆందోళనలు సైతం తొలగిపోతాయని, మానవ సంబంధాలు మెరుగుపడతాయని వివరించారు. కంటిలో నీటి కాసుల గురించి డాక్టర్ దివ్య దీప్తి అవగాహన కల్పించారు.

ప్రశాంతత కొరవడితే.. జీవనశైలి సమస్యలు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: నవ్వుతోనే ఆనందాన్ని, ప్రశాంతతను సాధించొచ్చని, ఫలితంగా చక్కటి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయని డాక్టర్ వి.వి.రామకుమార్ తెలిపారు. ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో రామకుమార్ మాట్లాడారు. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ఎన్నెన్నో జీవనశైలి సమస్యలకు మానసిక ప్రశాంతత కొరవడడమే కారణమన్నారు. నవ్వు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఎన్నో ప్రయోజనాలను అందించే నవ్వు ప్రాధాన్యం అందరూ తెలుసుకోవాలన్నారు. అప్రయత్నంగానో, ఉద్దేశపూర్వకంగానో.. ఎలాగైనా సరే నవ్విన వారికి నవ్వినంత మేలు చేకూరుతుందన్నారు. నవ్వు తెప్పించే పుస్తకాలు, జోకులు, కార్టూన్లు, వీడియోలు అందుబాటులో ఉన్నాయన్నారు. నవ్వు ప్రాధాన్యం, ఒనగూరే ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త సాయిరాం పాల్గొన్నారు.

మెకానిక్‌ల సంఘంపై బురద జల్లడం తగదు


మాట్లాడుతున్న నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాని

అరండల్‌పేట, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ సంక్షేమ సంఘంపై కావాలనే కొందరు బురద జల్లుతున్నారని సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సుభాని, రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లి సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని హోటల్‌లో ఆదివారం సుభాని మీడియాతో మాట్లాడారు. మెకానిక్‌ల సంక్షేమం, అభ్యున్నతి కోసమే నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల విజయవాడకు వరద ముంపు వచ్చిన సందర్భంలో సీఎం చంద్రబాబు పిలుపు మేరకు సంఘం ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలు ఉచితంగా మరమ్మతులు చేశామన్నారు. మెకానిక్‌ల పట్ల పోలీసు శాఖ సానుకూలంగా వ్యవహరించి, చలానాలు రాయకుండా చూడాలని సీఎం, హోంమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు టూవీలర్ మెకానిక్‌లకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నాగరాజు, శ్రీనివాసరావు, అన్వన్‌బాషా, భవాని, సయ్యద్ అబ్దుల్ హమీద్, గణేష్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, వేదికపై తూర్పు ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ సాధన ఎంతైనా అవసరమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. నగరంలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్వామి వివేకానంద యోగ కేంద్ర రజతోత్సవాలు ఆదివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్, స్వచ్ఛ భారత్ సాధనకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, తులసి గ్రూపు సంస్థల అధినేత తులసి రామచంద్రప్రభు, నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, సిద్ధపీఠం అధిపతి స్వాత్మానందయోగి పాల్గొన్నారు. సభకు యోగ గురు ఆళ్ల రాజేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్న సదుద్దేశంతో గుంటూరులో యోగ సంస్థను స్థాపించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 25 వేల మందికి పైగా ఈ ప్రక్రియను నేర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో శిష్యుల సాధనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. నగరంలోని ప్రముఖ గురువులు 40 మందిని నిర్వాహకులు సన్మానించారు.

ఆహ్లాదాన్ని పంచేదెప్పుడో..!

- అభివృద్ధికి దూరంగా మానససరోవరం పార్కు
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే:

నగరపాలకసంస్థకు చెందిన మానససరోవరం పార్కు ఒకప్పుడు ఆహ్లాదకర వాతావరణానికి చిరునామాగా ఉండేది. ప్రస్తుతం పార్కు నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేయడంతో అధ్వానంగా మారింది. గత వైకాపా పాలనలో కనీసం పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ దుస్థితి నెలకొంది.


శిథిలమైన పైలాన్


బోట్ షికారు కాల్వలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

గతంలో ప్రతిపాదనలు పంపినా..

జాతీయ రహదారి పక్కనే 53 ఎకరాల్లో మానససరోవరం పార్కు ఉంది. నాడు నిత్యం ఐదు వేలకుపైగా సందర్శకులు గుంటూరుతోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి వచ్చేవారు. ప్రస్తుతం కళావిహీనంగా.. శిథిలావస్థలోకి చేరడంతో మూసివేశారు. పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని గతంలో పనిచేసిన ఇద్దరు కమిషనర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ మానససరోవరం పార్కుపై నాయకులు, అధికారులు దృష్టి పెడతారని అందరూ భావించారు. అత్యాధునికంగా, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే పీపీపీ విధానంలోనే సాధ్యమని పార్కును అలాగే శిథిలావస్థలో ఉంచుతున్నారు.

వినియోగంలోకి తెస్తేనే..

అమలుకు నోచుకోని ప్రణాళికలు పట్టుకుని వేలాడకుండా.. పిచ్చిమొక్కలు, జంగిల్ తొలగించి, రహదారులు, కాటేజీల మరమ్మతులు చేసి, అల్పాహార స్టాల్స్, హోటల్స్‌ను ఏర్పాటు చేసి, సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా పునరుద్ధరిస్తే జీఎంసీకి ఆదాయం పెరుగుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. అత్యాధునికంగా, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే భారీగా ఖర్చవుతోంది. వినియోగంలోకి వచ్చాక చేయడం మరింత సులువవుతుంది. పార్కును వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు.. వర్షాలు పడినప్పుడు నీరు నిలవకుండా డ్రెయిన్ల ఏర్పాటు, లోతట్టుగా ఉన్నచోట మట్టి తోలించి చదును చేయించాలి. గతంలో మాదిరి పిల్లల ఆటపరికరాలతో పాటు, కంప్యూటర్ గేమింగ్ సెంటర్లు, కుటుంబ సమేతంగా వచ్చేవారికి ఆహ్లాదం పంచే విధంగా పచ్చదనం, ఇతర వసతులు అభివృద్ధి చేయాల్సి ఉంది. పార్కు అభివృద్ధికి తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినందున.. దీనికి సంబంధించి అధికారులు కూడా వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

'మోదీ మాటలు వారికి మింగుడుపడడం లేదు'

నగరపాలకసంస్థ: అమరావతి పునర్నిర్మాణ సభలో ప్రధాని చెప్పిన మాటలు వైకాపా నాయకులకు మింగుడుపడడం లేదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నా.. ప్రాజెక్టులు వేగంగా అభివృద్ధి చెందాలన్నా.. నాణ్యతతో పూర్తి చేయాలన్నా దేశంలో చంద్రబాబుకు తప్ప మరెవరికీ సాధ్యంకాదని స్వయంగా ప్రధాని మోదీ చెప్పిన విషయం గుర్తుచేశారు. క్విడ్‌ప్రోకో, మద్యం కుంభకోణం తదితర కేసుల్లో జగన్ శాశ్వతంగా జైలులోనే మగ్గక తప్పదని విమర్శించారు. జగన్‌తోపాటు ఆయన మంత్రి వర్గంలో చేసిన వారంతా వారు చేసిన నేరాలు, ఘోరాలకు జైలుపాలు కాక తప్పదని హెచ్చరించారు.

పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి

నగరపాలకసంస్థ: అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ, ముస్లిం యూత్ ఆధ్వర్యంలో పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్నా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. ఖత్నా నిర్వహించి వారికి మందులు, పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు పేదలను ఆదుకునేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలన్నారు. ఆరీఫ్, రౌఫ్, సలీం, రెహమాన్, షౌకత్, జిలానీ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలే


రౌడీషీటర్లకు.. సీఐ గంగా వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టాభిపురం ఠాణా పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నివాసం ఉండే ప్రాంతాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి సంఘటనలు జరిగినా వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. స్థానికులను బెదిరించి వసూళ్లకు పాల్పడినా, గొడవలకు దిగినా ఉపేక్షించేది లేదన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉంటూ జీవనోపాధి కోసం పనులకు వెళ్తుండాలని సూచించారు. మర్యాదగా మసలుకునే వారి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

ఆకట్టుకున్న నృత్య పోటీలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రాధామాధవ నాట్యక్షేత్రం ఆధ్వర్యంలో నాట్య గురువులకు నాట్య సారథి పురస్కారాలు, శిష్యులకు ఆదివారం రాత్రి నృత్యంలో పోటీలు నిర్వహించారు. పలువురు చిన్నారులు బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమాలను నాట్యాచార్య షేక్ ఖలీల్ నిర్వహించారు.


విజేతలతో నిర్వాహకుడు ఖలీల్

అన్నప్రసాదానికి కూరగాయల వితరణ


జెండా ఊపి కూరగాయల లారీ పంపుతున్న బోడపాటి ముఖర్జీ, లక్ష్మి దంపతులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి అన్నప్రసాదానికి గుంటూరుకు చెందిన భక్తులు 10 టన్నుల కూరగాయలు పంపారు. శ్రీకృష్ణదేవరాయ నగర్‌కు చెందిన బోడపాటి చైత్రశ్రీకి హెచ్1 వీసా రావడంతో శ్రీవారి నిత్యాన్నప్రసాదానికి 10 టన్నుల కూరగాయలు తిరుమలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఈమేరకు తల్లిదండ్రులు ముఖర్జీ, లక్ష్మి దంపతులు తిరుమలకు కూరగాయల లారీని జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సాదినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి తోడ్పాటు


సూరం సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నవభారత్‌నగర్, న్యూస్‌టుడే: కళాశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటాయని జేసీ న్యాయ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గం పేర్కొంది. కళాశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు బీవీఎస్ సుబ్రహ్మణ్య ప్రసాద్, కార్యదర్శి పి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సహకారంతో ఉచిత న్యాయ సలహా సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థి చర్మ వైద్య నిపుణుడు సూరం సుబ్రహ్మణ్యంను సత్కరించారు.

యూత్ హాస్టల్స్ సంఘ కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గుంటూరులోని టీజేపీఎస్ కళాశాలలో పరిశీలకుడు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా టి.చంద్రశేఖర్, ఛైర్మన్‌గా డాక్టర్ కె.కొండయ్య, కార్యదర్శిగా కె.రవికిరణ్, కోశాధికారిగా కె.సుధాకర్, ఉపాధ్యక్షులుగా కేశవ గురూజీ, జానకి, సంయుక్త కార్యదర్శులుగా కొండపు నాయుడు, శ్రీలత, నిర్వహణ కార్యదర్శిగా భానురావు, మీడియా సమన్వయకర్తలుగా గురుప్రసాద్, సునీల్ ఎన్నికయ్యారు. 2025-28 సంవత్సరాలకు కొత్త కార్యవర్గం ట్రెక్కింగ్, తదితర సాహస కార్యక్రమాలు నిర్వహిస్తారని నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

వంతెన నిర్మించి.. రాకపోకలు నియంత్రించి..

నగరంపాలెం, న్యూస్‌టుడే: జీజీహెచ్ అత్యవసర వైద్య సేవల విభాగంలో రోగులను పలు వార్డులకు తరలించేందుకు అంతర్గత వంతెనను ఆసుపత్రి అధికారులు ఎనిమిది నెలల కిందట పునర్నిర్మించారు. దీంతో అయా వార్డులకు రోగులను స్ట్రెచర్లపై సహాయకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా తరలించి వారికి కావాల్సిన వైద్య పరీక్షలు చేయించుకునేవారు. ఇటీవల అత్యవసర వైద్యసేవల విభాగంలోని అంతర్గత వంతెనను మూసివేయడంతో రోగులు, సహాయకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత వంతెన నుంచి పలు కీలకమైన వార్డులకు రోగులను తరలించొచ్చు. వంతెనను ఎందుకు మూసివేశారో తెలియక రోగులు, సహాయకులు పడే అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గతంలో అంతర్గత వంతెన ఇనుముతో తయారు చేయగా.. తుప్పు పట్టడంతో 'న్యూస్‌టుడే' కథనం ఇవ్వగా స్పందించిన అధికారులు శాశ్వతంగా రూ.1.50 లక్షలు వెచ్చించి సిమెంటు వంతెన నిర్మించారు. నెలలు గడవక ముందే వంతెనను మూసివేయడంతో ప్రజాధనం వృథాగా పోయిందని రోగుల సహాయకులు వాపోతున్నారు. ఓవైపు లిఫ్టులు, ర్యాంపులు పని చేయకపోవడం, మరోవైపు వంతెనను సైతం మూసివేయడంతో ఆయా వార్డులకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించి వంతెనపై రాకపోకలకు అనుమతించాలని కోరుతున్నారు.


జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగంలో మూసివేసిన వంతెన

బాధిత కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా

తాడేపల్లి: తాడేపల్లి పరిధిలోని ఉండవల్లిలో ఆదివారం ఉదయం గాలివానకు డీకొల్లు చైతన్య ఇంటి పైకప్పు దెబ్బతింది. మంత్రి లోకేశ్ స్పందించి బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆదివారం స్థానిక తెదేపా నాయకులు చైతన్యకు అందించారు. తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతిబసు, నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాయపూడి కిరణ్, వల్లభాపురం శంకర్, బసివిరెడ్డి, దాసరి కృష్ణ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి


మాట్లాడుతున్న అజయ్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పేదలకు ఇప్పటి వరకూ ఇంటి స్థలాలు ఇవ్వకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 2వ తేదీన ప్రధాని మోదీ సభ వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పేర్కొన్నారు. నగర కార్యదర్శి మాల్యాద్రి మాట్లాడుతూ.. శంకర్‌విలాస్ బ్రిడ్జికి గతంలో రూ.162 కోట్లు అంచనా వేసి ఇప్పుడు రూ.98 కోట్లతో బడ్జెట్ కుదించి నిర్మిస్తామని చెప్పడాన్ని ప్రజాసంఘాలు, సీపీఐ వ్యతిరేకిస్తున్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించాలనుకోవడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు రంగారెడ్డి, చైతన్య, జగన్నాథం, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడుగురిపై కిడ్నాప్ కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఆర్థికపరమైన లావాదేవీల వ్యవహారంలో మొత్తం ఏడుగురిపై అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవాపురానికి చెందిన హరిబాబుకు.. బృందావన్ గార్డెన్స్‌లోని కె.శ్రీనివాసరావుకు రియల్ ఎస్టేట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో విభేదాలున్నాయి. హరిబాబు అరండల్‌పేటలోని చిట్టిబాబు కార్యాలయానికి వెళ్తుండగా బృందావన్ గార్డెన్స్‌కు చెందిన ఎం.శ్రీనివాసరావు, కోండ్రు శ్రీనివాసరావుతో పాటు కొందరు వ్యక్తులు ఆయన్ని కిడ్నాప్ చేసి సంతకాలు చేయించుకునేందుకు దౌర్జన్యం చేసినట్లు హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరండల్‌పేట పోలీసులు ఈ వ్యవహారంలో మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరిలో తెదేపాకు చెందిన కార్పొరేటర్ భర్తతో పాటు మరికొందరు ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.